పత్రికతో.. మార్పులు
APTEL/25/A1880
TN తెలుగు న్యూస్
దిన పత్రిక
మా కలం మీ గళం.. సామాన్యుని గుండె చప్పుడు..
సంపుటి : 1 సంచిక : 747 పబ్లిషర్స్ & చీఫ్ ఎడిటర్ : యన్. కృష్ణారావు ఎడిటర్ : ఎస్. మస్తాన్ శుక్రవారం 16.10.2026 పేజీలు : 8 వెల : 4/-

## సంక్షేమం నుంచి స్వావలంబన దిశగా..
# ఇదే మా విధానం: సీఎం

- గ్రామీణ మహిళల ఉత్పత్తుల కోసం 'స్వయం ఏపీ' బ్రాండ్ ఆవిష్కరణ
- మహిళలను సంపద సృష్టికర్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్న చంద్రబాబు
- రాబోయే ఐదేళ్లలో మరో 5 లక్షల మంది మహిళా పారిశ్రామికవేత్తల తయారీకి ప్రణాళిక
- ప్రతి గ్రామాన్ని ఉపాధి కేంద్రంగా మార్చడమే ధ్యేయమని స్పష్టీకరణ



2లో

## విజయవాడలో జాతీయ సరస్ మేళా..
# ప్రారంభించిన రాష్ట్రపతి



విజయవాడ: విజయవాడలో జాతీయ సరస్ మేళా-2026 కార్యక్రమాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, పలువురు కేంద్ర మంత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సరస్ మేళాలో ఏర్పాటు చేసిన స్టాళ్లను రాష్ట్రపతి పరిశీలించారు. స్వయం సహాయక సంఘాలు తయారు చేసిన సహజ ఉత్పత్తులు, చేనేత వస్తువులు, హ్యాండీక్రాఫ్ట్‌లను వీక్షించారు. ఉత్పత్తుల ప్రత్యేకతలపై డ్వాక్రా మహిళలను అడిగి తెలుసుకున్నారు. ఓ స్టాల్‌లో చీర కొనుగోలు చేసి డిజిటల్ చెల్లింపులు చేశారు.

## 'సర్' రగడ: 17 రాష్ట్రాల్లో
## సమ్మరీ రివిజన్ షెడ్యూల్ విడుదల




- ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై తీవ్ర వివాదం
- 17 రాష్ట్రాల్లో స్పెషల్ సమ్మరీ రివిజన్‌కు ఈసీ ఆదేశం
- 2027 జనవరి 1ని అర్హత తేదీగా నిర్ణయించిన ఎన్నికల సంఘం
- ఏపీ, తెలంగాణ సహా పలు రాష్ట్రాలకు తర్వాత షెడ్యూల్ ప్రకటన

దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' (సర్) ప్రక్రియపై చెలరేగుతున్న వివాదాల నేపథ్యంలో భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) కీలక నిర్ణయం తీసుకుంది. 'సర్' నిర్వహణలో తలెత్తిన లోపాలను సరిదిద్దే లక్ష్యంతో, 17 రాష్ట్రాలు/ కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితాకు "స్పెషల్ సమ్మరీ రివిజన్" (ఎస్ఎస్ఆర్) చేపట్టాలని గురువారం ఆదేశాలు జారీ చేసింది. కొత్తగా ఓటు హక్కు పొందే యువతతో పాటు, సాంకేతిక కారణాల వల్ల జాబితాలో పేర్లు నమోదు కాని వారిని చేర్చేందుకు ఈ ప్రక్రియ తరువాయి 2లో

## ఏషియన్ హీరోలకు మోదీ పిలుపు
# 'మనం చేసి చూపిద్దాం

- ఆసియా క్రీడల పతక విజేతలతో ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేక భేటీ
- క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపిన ప్రధానమంత్రి
- భారత్‌ను గ్లోబల్ స్పోర్టింగ్ పవర్‌హౌస్‌గా మారుస్తామని ఉద్ఘాటన
- క్రీడా మౌలిక వసతుల ఆధునికీకరణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం
- మహిళల హాకీ, క్రికెట్, కబడ్డీ జట్ల



### చారిత్రక విజయాలపై ప్రశంసలు

భారతదేశం అనతికాలంలోనే అంతర్జాతీయ క్రీడారంగంలో తిరుగులేని శక్తిగా (గ్లోబల్ స్పోర్టింగ్ పవర్‌హౌస్) ఆవిర్భవించనుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. ఆసియా క్రీడలు 2026లో అద్భుత ప్రతిభ కనబరిచి దేశ కీర్తిప్రతిష్ఠలను తరువాయి 2లో

## మున్సిపల్ ఎన్నికలు
### కూటమి
# సీట్ల లెక్క తేలింది!

- 2026 మున్సిపల్ ఎన్నికలకు కూటమి సీట్ల పంపకం ఖరారు
- మొత్తం 17 కార్పొరేషన్లలో 11 టీడీపీకి, 4 జనసేనకు, 2 బీజేపీకి కేటాయింపు
- 106 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలలోనూ టీడీపీకి సింహభాగం

2లో



# యెమెన్ ప్యాలెస్‌పై క్షిపణి దాడి
## ప్రధానికి తప్పిన ముప్పు



- ఈ ఘటనలో ఇద్దరు భద్రతా సిబ్బంది మృతి, పలువురికి గాయాలు
- దాడి నుంచి సురక్షితంగా బయటపడిన ప్రధాని, ఇతర మంత్రులు
- సైనిక స్థావరాలే లక్ష్యంగా దాడి చేశామన్న హౌతీలు
- సౌదీ, హౌతీ రెబల్స్ మధ్య మరింత తీవ్రమవుతున్న ఘర్షణలు

యెమెన్‌లో మరోమారు ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరాయి. అంతర్జాతీయ గుర్తింపు పొందిన ప్రభుత్వం అధికారిక కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఏడెన్ నగరంలోని అధ్యక్ష భవనంపై హౌతీ రెబల్స్ క్షిపణి దాడికి తరువాయి 2లో





## సుప్రీంకోర్టు సీరియస్
## రాహుల్ ప్రవర్తనపై వివరణ కోరిన న్యాయస్థానం

- సుప్రీంకోర్టు వరకు ర్యాలీగా వెళ్లి రాహుల్‌పై సుప్రీం అసహనం
- తన చర్యలపై వివరణ ఇవ్వాలని ఆదేశం
- న్యాయవ్యవస్థపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నాలను సహించబోమని స్పష్టీకరణ

సుప్రీంకోర్టు వైపు నిరసన ర్యాలీ చేపట్టిన లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీరుపై సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర తరువాయి 2లో

## భారత్-అమెరికా ట్రేడ్ డీల్
# పీయూష్ గోయల్ కీలక ప్రకటన




- గత రెండు వారాల్లోనే 5వేలకు పైగా ఫేక్ సోషల్ మీడియా ఖాతాల సృష్టి
- 'సర్' నిరసనలను ఆసరాగా చేసుకుని హింసను ప్రేరేపించేందుకు కుట్ర
- కొత్త పంథాలో ఐఎస్ఐ.. చిన్న పట్టణాల నుంచి ఫేక్ న్యూస్ వ్యాప్తి
- కొందరు భారతీయులకు డబ్బులిచ్చి దేశ వ్యతిరేక ప్రచారం

2లో

# యెమెన్ ప్యాలెస్‌పై క్షిపణి దాడి: ప్రధానికి తప్పిన ముప్పు

యెమెన్‌లో మరోమారు ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరాయి. అంతర్జాతీయ గుర్తింపు పొందిన ప్రభుత్వం అధికారిక కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఏడెన్ నగరంలోని అధ్యక్ష భవనంపై హౌతీ రెబల్స్ క్షిపణి దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ఇద్దరు భద్రతా సిబ్బంది ప్రాణాలు కోల్పోగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. దక్షిణ యెమెన్‌లోని అల్‌మాషిక్ ప్యాలెస్‌ను లక్ష్యంగా చేసుకుని హౌతీలు ఐదు బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించారు. ఈ దాడి జరిగిన సమయంలో ప్యాలెస్‌లో ప్రధాని, ఇతర మంత్రులు ఉన్నప్పటికీ వారంతా సురక్షితంగా బయటపడ్డారని యెమెన్ సమాచార శాఖ మంత్రి మమ్మర్ అల్‌ఎర్యానీ వెల్లడించారు. అయితే, ఈ దాడిలో పలువురు గాయపడినట్లు ఆయన వివరించారు. మరోవైపు, ఈ దాడిపై హౌతీ అనుకూల మీడియా సంస్థలు స్పందించాయి. తాము సౌదీ అరేబియా నేతృత్వంలోని సైనిక కార్యకలాపాల ప్రధాన కార్యాలయంతో పాటు ఆయుధ డిపోలను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు నిర్వహించినట్లు ప్రకటించాయి. యెమెన్ ప్రభుత్వానికి మద్దతుగా సౌదీ అరేబియా నేతృత్వంలోని సంకీర్ణ దళాలు వైమానిక దాడులు నిర్వహిస్తున్న విషయం విదితమే. వీటికి ప్రతీకారంగా, ఇరాన్ మద్దతు గల హౌతీ రెబల్స్ తమ ఆధీనంలోని ప్రాంతాల నుంచి సౌదీ అరేబియాలోని విమానాశ్రయాలు, చమురు కేంద్రాలు, సైనిక స్థావరాలపై డ్రోన్లు, క్షిపణులతో దాడులకు తెగబడుతున్నారు. ఇటీవల సౌదీ రాజధాని రియాద్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయంపై హౌతీలు జరిపిన క్షిపణి దాడిలో 13 మంది మరణించారు. గత దశాబ్ద కాలంలో సౌదీ అరేబియాలో జరిగిన అత్యంత భీకర దాడిగా దీనిని పరిగణిస్తున్నారు.

## సుప్రీంకోర్టు సీరియస్
## రాహుల్ ప్రవర్తనపై వివరణ కోరిన న్యాయస్థానం

సుప్రీంకోర్టు వైపు నిరసన ర్యాలీ చేపట్టిన లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీరుపై సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ వ్యవహారంపై ఆయన వివరణ ఇవ్వాల్సిందేనని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. న్యాయవ్యవస్థపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నాలను సహించబోమని, ఎవరూ న్యాయవ్యవస్థను బెదిరించలేరని వ్యాఖ్యానించారు. అక్టోబర్ 12న రాహుల్ గాంధీతో పాటు ఇండియా కూటమి నేతలు సుప్రీంకోర్టు వైపు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ఎన్నికల సంఘం నిర్ణయాలను వ్యతిరేకిస్తూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని, ఎస్ఐఆర్‌ను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం రాహుల్ గాంధీ స్వయంగా సుప్రీంకోర్టుకు వెళ్లి, ఈ అంశంపై ఉమ్మడి పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై గురువారం విచారణ సందర్భంగా రాహుల్ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్‌తో ప్రధాన న్యాయమూర్తి మాట్లాడారు. ర్యాలీ సందర్భంగా ఏర్పడిన గందరగోళాన్ని ప్రస్తావిస్తూ, రాహుల్ తన చర్యలపై వివరణ ఇవ్వాలని పేర్కొన్నారు.

## ఏషియన్ హీరోలకు మోదీ పిలుపు: 'మనం చేసి చూపిద్దాం'

భారతదేశం అనతికాలంలోనే అంతర్జాతీయ క్రీడారంగంలో తిరుగులేని శక్తిగా (గ్లోబల్ స్పోర్టింగ్ పవర్‌హౌస్) ఆవిర్భవించనుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. ఆసియా క్రీడలు 2026లో అద్భుత ప్రతిభ కనబరిచి దేశ కీర్తిప్రతిష్ఠలను ఇనుమడింపజేసిన భారత క్రీడాకారులతో గురువారం ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా "మనం చేసి చూపిద్దాం" అనే కొత్త నినాదంతో వారిలో స్ఫూర్తిని నింపారు. దేశంలో క్రీడా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు, అథ్లెట్లకు అన్ని విధాలా అండగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పునరుద్ఘాటించారు. పతక విజేతలతో భేటీ కావడం అద్భుతమైన సందర్భమని అభివర్ణించిన ప్రధాని, క్రీడాకారుల అంకితభావాన్ని, వారు సాధించిన విజయాలను కొనియాడారు. "మీరు 140 కోట్ల మంది భారతీయుల గౌరవాన్ని పతాక స్థాయికి తీసుకెళ్లారు. త్రివర్ణ పతాక వైభవాన్ని చాటిచెప్పడమే మీరు సాధించిన అతిపెద్ద విజయం. లక్ష్యం పట్ల ఉన్న అభిరుచి విజయంగా రూపాంతరం చెందినప్పుడు, పతకాలతో పాటు ఆ క్రీడాకారుల ముఖాల్లో కనిపించే వర్చస్సు మీ అందరిలోనూ ప్రతిబింబిస్తోంది" అని మోదీ ప్రశంసించారు. ఈ ఘనత కేవలం క్రీడాకారులదే కాదని, దీని వెనుక కోచ్‌లు, సహాయక సిబ్బంది, కుటుంబ సభ్యులతో పాటు కోట్లాది మంది భారతీయుల ఆశీస్సులు ఉన్నాయని పేర్కొన్నారు. ఇదే తరుణంలో, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని ఆయనకు ఘన నివాళులు అర్పించారు.

**చారిత్రక విజయాలపై ప్రశంసలు**

ఈసారి ఆసియా క్రీడలు భారత్‌కు ఎన్నో మైలురాళ్లను మిగిల్చాయని ప్రధాని గుర్తుచేశారు. సుదీర్ఘమైన 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ మహిళల హాకీ జట్టు స్వర్ణం కైవసం చేసుకోవడాన్ని, అలాగే పురుషుల హాకీ జట్టు కూడా పసిడి పతకంతో మెరవడాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. క్రికెట్, కబడ్డీ విభాగాల్లో భారత్ 'డబుల్ గోల్డ్స్' సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఆర్చరీలో ఐదు స్వర్ణాలు, షూటింగ్, బాక్సింగ్, రెజ్లింగ్‌లో అథ్లెట్లు కనబరిచిన అద్భుత ప్రదర్శనలను అభినందించారు. అథ్లెటిక్స్‌లో కొత్త రికార్డులు నెలకొల్పడంతో పాటు, 28 ఏళ్ల తర్వాత వెయిట్‌లిఫ్టింగ్‌లో పతకం, 1982 తర్వాత మారథాన్‌లో విజయం వంటి చారిత్రక ఘనతలను ఆయన ప్రస్తావించారు. భారత్ సాధించిన మొత్తం 85 పతకాలలో మహిళా అథ్లెట్లు 11 స్వర్ణాలతో కలిపి మొత్తం 38 పతకాలు సాధించడం నవభారత ఆత్మవిశ్వాసానికి, మహిళా సాధికారతకు నిదర్శనమని ప్రధాని కొనియాడారు. మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్, సాఫ్ట్ టెన్నిస్, సెయిలింగ్ వంటి క్రీడల్లో తొలిసారిగా పతకాలు సాధించడాన్ని ప్రస్తావిస్తూ, గతంలో ప్రాతినిధ్యమే లేని క్రీడల్లోనూ నేడు భారత్ విజయకేతనం ఎగురవేస్తోందని ఆనందం వ్యక్తం చేశారు.

**క్రీడారంగానికి ప్రభుత్వ అండ**

గత దశాబ్ద కాలంగా క్రీడారంగం అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న విప్లవాత్మక చర్యలను మోదీ వివరించారు. ఒకప్పుడు దేశంలో క్రీడల పట్ల నెలకొన్న నైరాశ్యాన్ని అధిగమించి, నేడు నూతనోత్తేజంతో ముందుకు సాగుతున్నామని అన్నారు. 'టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్' (టాప్స్), 'ఖేలో ఇండియా' వంటి పథకాల ద్వారా పారదర్శకమైన, అత్యాధునిక క్రీడా వ్యవస్థను నిర్మిస్తున్నామని తెలిపారు. దేశవ్యాప్తంగా క్రీడా సమాఖ్యలను బలోపేతం చేసేందుకు, క్షేత్రస్థాయి కార్యక్రమాల కోసం సుమారు రూ.36 వేల కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. వెయ్యికి పైగా ఖేలో ఇండియా కేంద్రాలు, నూతన స్టేడియంలు, స్విమ్మింగ్ పూల్స్ వంటి మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ప్రతిభావంతులైన అథ్లెట్లకు 'టాప్స్' కింద నెలకు రూ.50 వేల ఆర్థిక ప్రోత్సాహం అందించడంతో పాటు, విదేశాల్లో శిక్షణ పొందేందుకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తున్నట్లు ప్రధాని తెలిపారు. 2028 లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌లో రాణించడంతో పాటు 2030 కామన్వెల్త్ గేమ్స్, 2036 ఒలింపిక్స్ క్రీడలకు ఆతిథ్యం ఇవ్వడమే ప్రధాన లక్ష్యాలుగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. గ్రామీణ స్థాయి నుంచే ప్రతిభను వెలికితీయడానికి విస్తృతంగా 'టాలెంట్ హంట్' నిర్వహిస్తామని చెప్పారు. క్రీడాకారులు తమ పాఠశాలలకు, గ్రామాలకు వెళ్లి అక్కడి చిన్నారుల్లో స్ఫూర్తి నింపాలని ఆయన పిలుపునిచ్చారు. క్రీడా స్ఫూర్తి జీవితంలో ఎదురయ్యే ఏ సవాలునైనా ధైర్యంగా ఎదుర్కొనేలా మనిషిని తీర్చిదిద్దుతుందని అభిప్రాయపడ్డారు. "ఆడేవాడే ఎదుగుతాడు" అనే తన సూత్రాన్ని పునరుద్ఘాటిస్తూ, "వికసిత భారత్" లక్ష్య సాధనలో క్రీడారంగం కీలక పాత్ర పోషిస్తుందని ప్రధాని పేర్కొన్నారు.

## సంక్షేమం నుంచి స్వావలంబన దిశగా..
## ఇదే మా విధానం: సీఎం

మహిళలను కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా పరిమితం చేయకుండా, వారిని అభివృద్ధి పథంలో నడిపిస్తూ ఆర్థిక స్వావలంబన దిశగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ప్రధాన విధానమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. మహిళలు ఉద్యోగాలు అడిగే స్థాయి నుంచి ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలని, సంపద సృష్టికర్తలుగా మారాలని ఆయన ఆకాంక్షించారు. ఈ లక్ష్య సాధనలో భాగంగా, గ్రామీణ మహిళల నైపుణ్యాలకు, ఉత్పత్తులకు జాతీయ స్థాయిలో వేదిక కల్పిస్తున్న జాతీయ సరస్ మేళా 2026ను విజయవాడలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కలిసి ఆయన గురువారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. గ్రామీణ మహిళలు తయారుచేసే ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చేందుకు 'స్వయం ఏపీ' బ్రాండ్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు ప్రకటించారు. దసరా శరన్నవరాత్రుల వేళ ఇంద్రకీలాద్రి సాక్షిగా ఈ మేళా నిర్వహించడం నగరానికి మరింత శోభను తెచ్చిందన్నారు. మారుమూల గిరిజన ప్రాంతంలో జన్మించి, ఎన్నో సవాళ్లను అధిగమించి దేశ అత్యున్నత పదవిని అలంకరించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జీవితం ప్రతి ఆడబిడ్డకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు.

**గ్రామాలే ఉపాధి కేంద్రాలుగా..**

రాష్ట్రంలో 1.10 కోట్ల మంది సభ్యులతో 11 లక్షల స్వయం సహాయక సంఘాలు (డ్వాక్రా) ఉన్నాయని, ఇవి ఏటా రూ.69 వేల కోట్ల టర్నోవర్ సాధిస్తున్నాయని చంద్రబాబు వివరించారు. నిన్నటి పొదుపు సంఘాలు నేడు వ్యాపార సంస్థలుగా రూపాంతరం చెందుతున్నాయని, భవిష్యత్తులో అంతర్జాతీయ బ్రాండ్లుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ మేళాలో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 650 స్వయం సహాయక సంఘాలు పాల్గొంటున్నాయని, ఇది కేవలం ప్రదర్శన కాదని, గ్రామీణ ఉత్పత్తులకు ఏడాది పొడవునా మార్కెటింగ్ అవకాశాలు కల్పించే దిశగా తొలి అడుగని పేర్కొన్నారు. తమ అనుభవాలను పంచుకుంటూ, కొత్త వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకోవాలని మహిళలకు సూచించారు.

**సాంకేతికతతో ప్రపంచ మార్కెట్‌కు..**

'స్వయం ఏపీ' బ్రాండ్ ఉత్పత్తులను ఈకామర్స్, ఆన్‌లైన్ షాపింగ్ వేదికల ద్వారా ప్రపంచ మార్కెట్‌కు పరిచయం చేస్తామని చంద్రబాబు తెలిపారు. వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాలను వ్యాపార అభివృద్ధికి వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. మహిళల సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకున్నప్పుడే 'వికసిత్ భారత్' లక్ష్యం సాధ్యమవుతుందని అన్నారు. మహిళల భద్రత, ఆత్మగౌరవానికి ప్రాధాన్యమిస్తూనే, వారి ఆర్థిక ఎదుగుదలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రతి స్వయం సహాయక సంఘం ఒక ఆర్థిక శక్తిగా, ప్రతి మహిళ ఒక పారిశ్రామికవేత్తగా, ప్రతి గ్రామం ఒక ఉపాధి కేంద్రంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రులు శివరాజ్ సింగ్ చౌహాన్, పెమ్మసాని చంద్రశేఖర్, రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, వంగలపూడి అనిత తదితరులు పాల్గొన్నారు.

## 'సర్' రగడ: 17 రాష్ట్రాల్లో
## సమ్మరీ రివిజన్ షెడ్యూల్ విడుదల

దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' (సర్) ప్రక్రియపై చెలరేగుతున్న వివాదాల నేపథ్యంలో భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) కీలక నిర్ణయం తీసుకుంది. 'సర్' నిర్వహణలో తలెత్తిన లోపాలను సరిదిద్దే లక్ష్యంతో, 17 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితాకు "స్పెషల్ సమ్మరీ రివిజన్" (ఎస్ఎస్ఆర్) చేపట్టాలని గురువారం ఆదేశాలు జారీ చేసింది. కొత్తగా ఓటు హక్కు పొందే యువతతో పాటు, సాంకేతిక కారణాల వల్ల జాబితాలో పేర్లు నమోదు కాని వారిని చేర్చేందుకు ఈ ప్రక్రియ దోహదపడనుంది. పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, పంజాబ్, బీహార్, తమిళనాడు వంటి కీలక రాష్ట్రాలు ఈ జాబితాలో ఉన్నాయి. 2027 జనవరి 1వ తేదీని అర్హత తేదీగా ఎన్నికల సంఘం నిర్ణయించింది. తాజా షెడ్యూల్ ప్రకారం, నవంబర్ 12న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించి, అభ్యంతరాల స్వీకరణ అనంతరం 2027 జనవరి 4న తుది జాబితాను విడుదల చేస్తారు. కాగా, 2027 ఫిబ్రవరి నాటికి ఉత్తరప్రదేశ్, పంజాబ్ రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలో ఈ ప్రక్రియ ప్రాధాన్యత సంతరించుకుంది.

**వివాదానికి దారితీసిన సర్**

'సర్' ప్రక్రియలో భాగంగా భారీస్థాయిలో ఓటర్ల పేర్లను తొలగించడంపై ప్రతిపక్షాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యంగా, ఫారం 6తో పాటు ఓటర్లు ఒక అదనపు డిక్లరేషన్ సమర్పించాలన్న నిబంధన వివాదానికి కేంద్ర బిందువుగా మారింది. సుమారు 20 ఏళ్ల క్రితం జరిగిన 'సర్' వివరాలతో ప్రస్తుత దరఖాస్తుదారుల తల్లిదండ్రుల వివరాలను అనుసంధానం చేయాలని కోరడాన్ని ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఈ నిబంధనలు అసంబద్ధంగా ఉన్నాయని, ఓటర్లను ఇబ్బందులకు గురిచేసేలా ఉన్నాయని ఆరోపిస్తున్నాయి. ఈ వివాదం నేపథ్యంలో 'ఇండియా' కూటమి పార్టీలు, కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వంటి యువజన సంఘాలు ఢిల్లీలో నిరసనలు చేపట్టాయి. తక్షణమే చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

**ఏపీ, తెలంగాణలో పరిస్థితి ఏంటి?**

ప్రస్తుతం 'సర్' ప్రక్రియ కొనసాగుతున్న లేదా ఇటీవలే పూర్తయిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, హర్యానా, ఢిల్లీ సహా పలు రాష్ట్రాల్లో 'ఎస్ఎస్ఆర్' షెడ్యూల్‌ను త్వరలో ప్రకటిస్తామని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. అదేవిధంగా, వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఇప్పటివరకు 'సర్' ప్రారంభం కాని హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్, లడఖ్‌లలో కూడా ఓటర్ల జాబితా సవరణ షెడ్యూల్‌ను తగిన సమయంలో వెల్లడిస్తామని ఈసీ తన ఉత్తర్వుల్లో పేర్కొంది. సెప్టెంబర్ 29న ఇచ్చిన ఆదేశాల మేరకు, అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని రాష్ట్రాల అధికారులకు సూచించినట్లు ఈసీ గుర్తు చేసింది.

## మున్సిపల్ ఎన్నికలు
## కూటమి సీట్ల లెక్క తేలింది!

ఆంధ్రప్రదేశ్‌లో అధికార టీడీపీ జనసేనబీజేపీ కూటమి రాబోయే పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల కోసం పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతోంది. 2026లో జరగనున్న మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి మిత్రపక్షాల మధ్య సీట్ల పంపకం ప్రక్రియను పూర్తి చేసింది. రాష్ట్రంలోని 17 మున్సిపల్ కార్పొరేషన్లు, 106 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు గాను ఏ పార్టీ ఎక్కడ పోటీ చేయాలో స్పష్టతనిస్తూ కూటమి నాయకత్వం తుది నిర్ణయం తీసుకుంది. ఈ పంపకాల్లో, ఇటీవలి సార్వత్రిక ఎన్నికల మాదిరిగానే తెలుగుదేశం పార్టీకి సింహభాగం దక్కింది.

**కార్పొరేషన్ల కేటాయింపు ఇలా..**

రాష్ట్రంలోని 17 మున్సిపల్ కార్పొరేషన్ల విషయానికి వస్తే, టీడీపీ 11 స్థానాల్లో పోటీ చేయనుంది. జనసేన పార్టీకి 4, బీజేపీకి 2 కార్పొరేషన్లను కేటాయించారు. గ్రేటర్ విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, తిరుపతి వంటి కీలక నగరాల భవిష్యత్తును ఈ పంపకం నిర్దేశించనుంది. విశాఖ, గుంటూరు, తిరుపతి, మచిలీపట్నం వంటి ప్రధాన కార్పొరేషన్లను టీడీపీ తన వద్ద ఉంచుకోగా, విజయవాడ, కాకినాడ, శ్రీకాకుళం, ఏలూరు కార్పొరేషన్లలో జనసేన అభ్యర్థులు బరిలోకి దిగనున్నారు. ఇక, రాజమహేంద్రవరం, అనంతపురం కార్పొరేషన్లను బీజేపీకి కేటాయించారు. మొత్తం మీద చూస్తే, 123 పట్టణ స్థానిక సంస్థల్లో టీడీపీ 89, జనసేన 25, బీజేపీ 9 స్థానాల్లో పోటీ చేయనున్నాయి. సార్వత్రిక ఎన్నికల ఫలితాల స్ఫూర్తితో, రెండేళ్ల ముందుగానే స్థానిక సంస్థల ఎన్నికలకు పక్కా ప్రణాళికతో సిద్ధమవడం ద్వారా క్షేత్రస్థాయిలో తమ పట్టును మరింత పటిష్ఠం చేసుకోవాలని కూటమి భావిస్తున్నట్లు ఈ సీట్ల పంపకం స్పష్టం చేస్తోంది.

## భారత్..అమెరికా ట్రేడ్ డీల్: పీయూష్ గోయల్ కీలక ప్రకటన

భారత్‌అమెరికా మధ్య దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వాణిజ్య ఒప్పందానికి సంబంధించి కీలక పురోగతి లభించింది. ఇరు దేశాల మధ్య ప్రతిపాదిత ట్రేడ్ డీల్‌లో మొదటి దశ ఖరారైందని, ప్రస్తుతం ఇది న్యాయపరమైన ముసాయిదా (లీగల్ డ్రాఫ్టింగ్) దశలో ఉందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. గురువారం ఢిల్లీలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆయన ఈ వివరాలను పంచుకున్నారు. "అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందానికి సంబంధించి తొలి విడత చర్చలు ఫలప్రదమయ్యాయి. ప్రస్తుతం దీనికి తుది మెరుగులు దిద్దుతున్నాం. చట్టపరమైన ప్రక్రియ పూర్తయిన తర్వాత, మన పోటీ దేశాలతో పోలిస్తే భారత్‌కు స్పష్టమైన ప్రయోజనాలు చేకూరేలా ఈ ఒప్పందాన్ని అమలు చేస్తాం" అని పీయూష్ గోయల్ వివరించారు. ఇదే విషయంపై వాణిజ్య శాఖ కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ స్పందిస్తూ, చర్చలు సానుకూల దిశలో సాగుతున్నాయని, వీలైనంత త్వరగా ఒప్పందం కొలిక్కి వస్తుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.



అమెరికాలో టారిఫ్ విధానంపై మరింత స్పష్టత వచ్చిన తర్వాత ఈ ప్రక్రియ వేగవంతమవుతుందని ఆయన పేర్కొన్నారు. విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ సైతం ఈ ఒప్పందంపై ఆశాభావం వ్యక్తం చేశారు. చర్చలు తుది దశకు (ల్యాండింగ్ పాయింట్) చేరుకుంటున్నాయని, ఇరు దేశాల మధ్య ఉన్న వ్యూహాత్మక భాగస్వామ్యంలో ఎలాంటి మార్పు లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ ఒప్పందం ద్వారా ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌కు దక్కే అదనపు ప్రయోజనాలే కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే, అమెరికా ట్రేడ్ రిప్రజెంటేటివ్ (యూఎస్‌టీఆర్) జేమీసన్ గ్రీర్ ఇటీవల మాట్లాడుతూ, ఈ ఒప్పందాన్ని ఖరారు చేసేందుకు ఇరు దేశాలు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నప్పటికీ, ఇది వెంటనే కార్యరూపం దాల్చే అవకాశం లేదని అభిప్రాయపడ్డారు. ఇంకా పరిష్కారం కాని కొన్ని అంశాలపై ఇరు దేశాల మధ్య సంప్రదింపులు కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. టారిఫ్ సమస్యలు, ఇతర అడ్డంకులను తొలగించి, ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేసుకునే లక్ష్యంతో 2025 ప్రారంభం నుంచి భారత్, అమెరికా మధ్య ఈ చర్చలు సాగుతున్నాయి. గతంలో అమెరికా విధించిన సుంకాలు, హెచ్1బీ వీసా ఫీజుల పెంపు, గ్రీన్ కార్డ్ ప్రాసెసింగ్‌పై ఆంక్షల వంటి పరిణామాలు ఇరు దేశాల సంబంధాలపై ప్రభావం చూపిన నేపథ్యంలో, తాజా పరిణామం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.

## సంపాదకీయం

# నియంత్రిత ప్రజాస్వామ్యం..
# నిర్భయ యువతరం...

మొన్నటి రాహుల్ గాంధీ ప్రెస్ మీట్‌లో భాగస్వాములైన, జ్ఞానేశ్వర్ రాజీనామాను కోరుతూ ప్రొటెస్ట్ చేసిన యువత, ఆ రోజు తాము ఎదుర్కొన్న పోలీసు హింసను గురించి ప్రెస్‌కు వివరిస్తుంటే మన దేశాన్ని ఇంకా బ్రిటిష్ వాళ్ళే పరిపాలిస్తున్నారా అనే అనుమానం ఎవరికైనా కలుగుతుంది. జ్ఞానేశ్వర్ రాజీనామాను కోరుతూ జరుగుతున్న ఆందోళనలలో ఉన్న ప్రధానమైన డిమాండును ప్రభుత్వం అర్ధం చేసుకుని ఉంటే, ఈరోజు ఢిల్లీ పోలీసుల పహారాలో ఉండవలసిన అవసరం ఉండేది కాదు. అసలు సమస్య అయిన ఎన్నికల సంఘం, ప్రజల ఓటు హక్కును సంక్లిష్టం చేసిన జ్ఞానేశ్వర్ నిర్ణయాలు ప్రక్కకు పోయి, నిరసనకారుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు చర్చనీయాంశం అయింది. రాహుల్ ప్రెస్ మీట్‌లో ఇద్దరు అమ్మాయిలు, ఒక ముస్లిం యువకుడు చెప్పిన విషయాలు గమనిస్తే, పోలీసులు మహిళా నిరసనకారులపై, మహిళలు నిరసనల్లో పాల్గొంటే మహిళలుగా ఎటువంటి అవమానాలు ఎదుర్కోవలసి వస్తుందో చెప్పి వారిని భయపెట్టటానికి చేసిన ప్రయత్నం స్పష్టంగా కనిపిస్తున్నది. వారి ప్రైవేట్ పార్ట్స్ మీద అమానుషంగా దాడి చేసి, శారీరక హింసతో మహిళల ఆత్మాభిమానాన్ని కూడా దెబ్బతీసే ప్రయత్నం చేశారు. ఆ మహిళా నిరసనకారులను అదుపులోకి తీసుకునే సమయంలో పాటించవలసిన నియమాలు పాటించకపోవటమే పెద్ద అపరాధం. ఒకసారి అదుపులోకి తీసుకున్న తరువాత వారి మీద లాఠీని ప్రయోగించవలసిన అవసరం లేదు. తమ కస్టడీలోకి తీసుకున్న తరువాత వారు రోడ్లపైన బైఠాయించి ఆందోళన చెయ్యలేరు. వారిని డిటైన్ చేసిన తరువాత వారి నుండి జ్ఞానేశ్వర్‌కు కానీ, ప్రభుత్వ ఆస్తులకు కానీ వాటిల్లే ప్రమాదం ఏమీ లేదు. అయినా విచ్చలవిడిగా లాఠీని ప్రయోగించారు. సీసీ టీవీ లేని పోలీస్ స్టేషన్ సెల్లార్‌లోకి తీసుకెళ్ళి ఆడపిల్లలను కొడుతూ పోలీసులు నవ్వారని చెబుతుంటే, వారు రక్షక భటులా లేక రాక్షస భటులా అనిపిస్తుంది. దుశ్శాసనుల మాదిరిగా వికటాట్టహాసం చేశారనిపించింది. మరొక స్టేషన్లో ఒక ముస్లిం యువకుడిని "నువ్వు ముస్లిం కదా" అని పదే పదే అడుగుతూ కొట్టారని చెబుతుంటే దేశం ఎటువైపు పోతున్నది అనిపించింది. అంటే ఆడపిల్లలైతే ఒక రకం ట్రీట్‌మెంట్, ముస్లిం యువత అయితే ఒక రకం ట్రీట్‌మెంట్ ఇవ్వటాన్ని గమనిస్తే బ్రిటిష్ వారి 'విభజించు - పాలించు' అనే విధానం కనిపిస్తున్నది. ఒక అమ్మాయి చెవిపైన పడిన దెబ్బకు ఆ అమ్మాయి కర్ణభేరి దెబ్బతిన్నది. ఇంతటి పోలీసు అత్యాచారంలో కూడా దేశ ప్రజలు సంతోషపడుతున్న విషయం ఒక్కటే: వారు భయపడలేదు. అయినా ప్రజలను వేధిస్తున్న ప్రశ్న ఒకటే. పోలీసు చేతికి లాఠీ ఎందుకు ఇచ్చారు? సామాన్యులను భయపెట్టటానికా లేక నేరగాళ్లను అదుపు చేయడానికా? నిరసన అనేది మనకు రాజ్యాంగం ప్రసాదించిన హక్కు. భావప్రకటనా స్వేచ్ఛకు ఎలాగూ సంకెళ్లు వేస్తున్నారు. విపక్షాలపైన సామాజిక మాధ్యమాల ద్వారా జరిగే దాడిపైన ఎటువంటి ఆంక్షలూ ఉండవు. కానీ అన్యాయాన్ని నిరసిస్తూ తమ గళం విప్పితే మాత్రం రాజ్యం తన హింసా ప్రవృత్తిని బయటపెడుతుంది. దాని అస్త్రంగా పోలీసును ఉపయోగిస్తుంది. నిరసనకారులను నేరగాళ్లుగా చిత్రీకరిస్తుంది. పోలీసులు చెలరేగిపోతారు. ఆ నిమిషానికి వారే ప్రధానమంత్రి కంటే కూడా అధికారం కలిగిన వారిగా తమను తాము భావించుకుంటారు. చాలామందికి ఇది అతిశయోక్తి అనిపిస్తుంది. కానీ మార్క్సిస్ట్ కమ్యూనిస్టు పార్టీ రాజ్యసభ సభ్యుడు జాన్ బ్రిట్టాస్ పైన పోలీసులు చేసిన అరాచకాన్ని గమనించిన ఎవరికైనా అది అతిశయోక్తి అనిపించదు. దేశంలో ప్రజాస్వామ్యం ఎలా పరిహాసానికి గురి అవుతుందో పాత్రికేయులకు వివరిస్తూ ఉంటే, ఆయన్ను అమాంతం గాల్లోకి ఎత్తి తీసుకుని వెళ్లి పోలీస్ వాహనంలో పడేయటమే ఆందోళన కలిగించే విషయం. అది అంతటితో ఆగలేదు. ఆయన్ను సీటుకు అదిమిపెట్టి తమ దమనకాండను సాగించారు. ఈరోజు జాన్ బ్రిట్టాస్ రామ్ మనోహర్ లోహియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పార్లమెంటు సభ్యుడు చట్టానికి అతీతుడు కాకపోవచ్చు. కానీ ఆయన్ను అంత అమానుషంగా హింసించటానికి ఆయన చేసిన నేరం ఏమిటి అనే ప్రశ్నతో పాటే, ఒక రాజ్యసభ సభ్యుడినే అలా హింసించిన పోలీసులు సామాన్య ప్రజలను ఎంతగా హింసించగలరో అనే సందేహం కూడా కలుగుతున్నది. "ఇలాంటి పోలీసులు ప్రజలను ఎలా రక్షించగలరు?" అంటూ ఆయన ఒక లేఖను సంధించారు. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును రాజ్యాంగం ప్రసాదించింది. నిరసనల్లో హింస చెలరేగితే నిలువరించే హక్కు మాత్రమే ప్రభుత్వానికి ఉంటుంది. కానీ నిరసన తెలిపే హక్కే లేదు అన్న చందంగా ప్రభుత్వమే వేలాదిగా బలగాలను మోహరిస్తే ప్రజలకు మిగిలిన హక్కు ఏమున్నది! అందులోనూ చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవటం తమ హక్కుగా భావించే మన పోలీసు వ్యవస్థ! అంటే విపక్షమో, ఉత్సాహవంతులైన యువతో ప్రభుత్వాన్ని నిలదీయాలనుకుంటే ప్రభుత్వమే హింసాకాండను అమలు చేస్తుంది! హింస అనేది ప్రభుత్వం యొక్క ప్రాథమిక హక్కుగానూ, దానికి సాధనంగా పోలీసును ఉపయోగించుకుంటే ఇక ప్రజాస్వామ్యం ఏముంది? ప్రజలకు రాజ్యాంగం ప్రసాదించే హక్కులను ప్రక్కన పెట్టి ప్రభుత్వం నియంత్రిత హక్కులను ప్రసాదిస్తుంది. మనకు భావప్రకటనా స్వేచ్ఛ ఉంటుంది; కానీ ప్రభుత్వాన్ని చిరాకు పెట్టనంతవరకు! దేశంలో ఎవరైనా ఎక్కడైనా సంచరించవచ్చు; కానీ ప్రభుత్వం ఒప్పుకునే విధంగా సంచరిస్తేనే అది హక్కు! ర్యాలీలు చేయవచ్చు; ప్రభుత్వానికి మద్దతుగా మాత్రమే! నియంత్రిత ప్రజాస్వామ్యం. ప్రభుత్వం తరపున పోలీసుల నియంతృత్వం. ఈ చట్రంలో ఇరుక్కుపోయిన వ్యవస్థలు వేటికవే తమదే ఇష్టారాజ్యం అనుకుంటున్నాయి. వీరికి వ్యతిరేకంగా ఎవరైనా న్యాయస్థానానికి వెళ్తారనే భయం ఏ వ్యవస్థకూ లేదు. అది విచారణకు వచ్చినప్పటి సంగతి కదా అనే నిర్భీతి. అందుకే మొన్నటి ఆందోళనల్లో శాంతియుతంగా ర్యాలీగా వెళ్తున్న సుప్రీంకోర్టు న్యాయవాదులను నిర్బంధంలోకి తీసుకోవటానికి కూడా పోలీసు వ్యవస్థ జంకలేదు. న్యాయవాదులను అదుపులోకి తీసుకున్నారు అనగానే సుప్రీంకోర్టు వెంటనే స్పందించింది. అదే స్పందన సామాన్యుడి పట్ల కూడా చూపించి ఉంటే న్యాయస్థానం అంటే పోలీసులకు భయమూ, ప్రజలకు విశ్వాసం పెరిగే అవకాశం ఉంటుంది. కానీ ఆ చిన్న పిల్లలను శారీరకంగా, మానసికంగా హింసించిన పోలీసుల పైన చర్యలకు ఆదేశించటానికి న్యాయస్థానం ఎప్పుడు ముందుకొస్తుంది? తామిచ్చిన ఆదేశాలకు విరుద్ధంగా ప్రభుత్వం మెట్రో స్టేషన్లు మూసివేసి, బస్సులను రద్దుచేసి, ముందస్తు నిర్బంధాలకు పాల్పడటం పైన న్యాయస్థానం ఎప్పుడు చర్యలకు ఉపక్రమిస్తుంది అనే ప్రశ్నలకు మన దగ్గర సమాధానం లేదు. అందుకే ప్రజల హక్కుల పట్ల పోలీసులకు, ఆ వ్యవస్థను నియంత్రించే ప్రభుత్వాలకు భయం లేదు. ఇన్ని సమాధానాలు లేని ప్రశ్నల మధ్య దేశ ప్రజలకు ఉన్న ఒకే ఒక ఆశాదీపం మన యువత. పోలీసు హింసకు గురి అయిన తరువాత కూడా ఆ పిల్లలు "మేం భయపడం, ఏ పోరాటానికైనా మేం సిద్ధం" అని ప్రెస్ మీట్‌లో చెప్పిన విధానం ఒక్కటే నియంత్రిత వ్యవస్థలతో సతమతమవుతున్న ప్రజలకు భరోసా. దేశ రాజధానిలో మన గొంతుకను వినిపిస్తూ రాజ్యహింసకు కూడా వెరవని మన పిల్లల ఆత్మవిశ్వాసమే ఈ దేశానికి శ్రీరామరక్ష. "తమ కళ్లు దెబ్బతిన్నా, తమ కాళ్లు వంకర పోయినా, తమ వినికిడి శక్తిని కోల్పోయినా మేము మా పోరాటాన్ని ఆపేది లేదు" అని చెక్కుచెదరని ఆత్మవిశ్వాసంతో, మొక్కవోని ధైర్యంతో చెబుతున్న ఆ పిల్లల తల్లిదండ్రులు వారిని అంత యోధుల్లా మలచిన విధానం అందరికీ స్ఫూర్తిదాయకం. వారికి కృతజ్ఞతాభివందనాలు.!

- ఇంద్రాణి

## చరిత్రలో ఈ రోజు
### అక్టోబర్ 16

OCT 16

* ప్రపంచ ఆహార దినోత్సవం. (చిత్రంలో)
* ప్రపంచ అనస్థీషియా దినోత్సవం
* 1846: వైద్యరంగంలో మొట్టమొదటిసారిగా మత్తుమందు (అనస్థీషియా)ను ఉపయోగించారు.
* 1854: ఐర్లండుకు చెందిన కవి, రచయిత ఆస్కార్ వైల్డ్ జననం (మ.1900).
* 1905: బ్రిటిషు వారు బెంగాల్ రాష్ట్రాన్ని తూర్పు బెంగాల్, పశ్చిమ బెంగాల్ గా విభజించారు.
* 1958: తెలుగు రచయిత, అభ్యుదయ కవి, కథారచయిత, నాటకకర్త తెన్నేటి సూరి మరణం (జ.1911).
* 1977: అమెరికన్ వాద్యకారుడు జాన్ మేయర్ జననం.
* 1982: భారతీయ చిత్ర నటుడు, నేపథ్య గాయకుడు, నిర్మాత పృథ్వీరాజ్ సుకుమారన్ జననం.



ప్రపంచ ఆహార దినోత్సవం

## విచ్ఛిన్నకర శక్తులతో
# జగన్ చేతులు కలిపారు

: పీవీఎన్ మాధవ్

అమరావతి: కేసులు ఎదుర్కొంటున్న జగన్‌తో చేతులు కలపడం ద్వారా కాక్రోచ్ జనతా పార్టీ అజెండా ఏంటో స్పష్టమైందని భాజపా ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఎద్దేవా చేశారు. "నాడు ఆలయాల ఆస్తుల ఆక్రమణ, మత మార్పిడులను జగన్ ప్రోత్సహించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్తం చేశారు. నేడు రాజకీయ లబ్ధి కోసం దేశ విచ్ఛిన్నకర శక్తులతో చేతులు కలిపారు. వైకాపా పాలనలో ఎదురైన ఇబ్బందులను రాష్ట్ర ప్రజలు మర్చిపోలేదు. ప్రజాస్వామ్యం పేరుతో దేశంలో అస్థిరత, విధ్వంసం సృష్టించేందుకు ప్రయత్నిస్తున్న శక్తులతో కలిసి జగన్ సాగిస్తున్న రాజకీయ ప్రయత్నాలను వారు నిశితంగా గమనిస్తున్నారు. తగిన సమయంలో



ప్రజాస్వామ్యబద్ధంగా తమ తీర్పును వెల్లడిస్తారు" అని పేర్కొన్నారు. సీజేపీకి మద్దతుగా జగన్ చేసిన పోస్టు.. దానికి సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ధన్యవాదాలు తెలపడం ఏపీ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

## ఈడీ విచారణకు హాజరైన
# వివేకా హత్య కేసు నిందితుడు శివశంకర్‌రెడ్డి



హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఈడీ విచారణకు దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి మరోసారి హాజరయ్యారు. హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయానికి వచ్చిన ఆయన్ను ఆర్థిక లావాదేవీలపై ప్రశ్నిస్తున్నారు. ఈ కేసులో శివశంకర్‌రెడ్డి ఏ5 నిందితుడిగా ఉన్నారు. వివేకా హత్యకు కీలక కుట్రదారులు వెచ్చించాలనుకున్న రూ.40 కోట్లకు సంబంధించిన మూలాలు, ఆ లావాదేవీలతో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి ఉన్న సంబంధాల పైనే ప్రధానంగా విచారణ కొనసాగుతోంది.



## విజయవాడ దుర్గమ్మకు
# రూ.75 లక్షల విలువైన స్వర్ణ కిరీటం విరాళం

- **శ్రీకాకుళం జిల్లాకు చెందిన భక్తుడు దుర్గా శ్రీనివాస్ సమర్పణ**
- **494 గ్రాముల బంగారంతో నవరత్నాలతో కిరీటం తయారీ**
- **దసరా శరన్నవరాత్రి ఉత్సవాల వేళ ఈ కానుక అందజేత**

విజయవాడ ఇంద్రకీలాద్రిపై వెలసిన శ్రీ కనకదుర్గ అమ్మవారికి దసరా శరన్నవరాత్రి ఉత్సవాల వేళ భారీ కానుక అందింది. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఓ భక్తుడు సుమారు రూ.75 లక్షల విలువైన స్వర్ణ కిరీటాన్ని అమ్మవారికి విరాళంగా సమర్పించారు. వివరాల్లోకి వెళితే.. శ్రీకాకుళం జిల్లాకు చెందిన కుర్మినాయుడు, పద్మావతమ్మ దంపతుల కుమారుడైన కె. దుర్గా శ్రీనివాస్ ఈ కిరీటాన్ని విరాళంగా ఇచ్చారు. 494 గ్రాముల స్వచ్ఛమైన బంగారంతో రూపొందించిన ఈ కిరీటంలో ఎరుపు, నీలం, తెలుపు, ఆకుపచ్చ రంగుల నవరత్నాలను పొదిగారు. దసరా ఉత్సవాల సందర్భంగా దుర్గా శ్రీనివాస్ ఈ కిరీటాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) శీనానాయక్ కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అమ్మవారి ఆశీస్సులతోనే ఈ కానుకను సమర్పించానని, పవిత్రమైన నవరాత్రుల సమయంలో కిరీటాన్ని అందించడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. ప్రస్తుతం ఆలయంలో జరుగుతున్న ప్రత్యేక పూజలు, దర్శనాల నడుమ ఈ విరాళం అందడం విశేషం.

# పబ్‌లో పోలీసులతో గొడవ.. ఐఏఎస్ అధికారిని బదిలీ చేసిన ఏపీ ప్రభుత్వం

- **బెంగళూరు పబ్‌లో పోలీసులతో గొడవపడిన వికాస్ మర్మత్ బదిలీ**
- **కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా ఉన్న ఐఏఎస్ అధికారి**
- **విధులకు ఆటంకం కలిగించారని పోలీసుల ఫిర్యాదుతో కేసు నమోదు**
- **ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో బదిలీ ఉత్తర్వుల జారీ**
- **సాధారణ పరిపాలన శాఖలో రిపోర్ట్ చేయాలని ప్రభుత్వ ఆదేశం**

బెంగళూరులోని ఓ పబ్‌లో పోలీసులతో గొడవపడిన ఘటనలో ఏపీకి చెందిన ఐఏఎస్ అధికారి వికాస్ మర్మత్‌పై బదిలీ వేటు పడింది. 'కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ' (కాడా) ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఆయనను వెంటనే బాధ్యతల నుంచి తప్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి పోస్టింగ్ కోసం సాధారణ పరిపాలన శాఖలో (జీఏడీ) రిపోర్ట్ చేయాలని ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ ఈ బదిలీ ఉత్తర్వులను జారీ చేశారు. 'కాడా' ప్రాజెక్ట్ డైరెక్టర్ పోస్టుకు వెంటనే ఇన్‌ఛార్జ్ బాధ్యతలు అప్పగించాలని చిత్తూరు జిల్లా కలెక్టర్‌కు సూచించారు. అక్టోబర్ 10న తెల్లవారుజామున 1:30 గంటల సమయంలో బెంగళూరులోని రెసిడెన్సీ రోడ్డులో ఉన్న ఓ పబ్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. రాత్రిపూట తనిఖీలు



నిర్వహిస్తున్న పోలీసులు, వయసు నిర్ధారణ కోసం కస్టమర్ల గుర్తింపు పత్రాలు అడిగారు. ఈ క్రమంలో వికాస్ మర్మత్, ఆయన స్నేహితులు పోలీసులతో వాగ్వాదానికి దిగి, వారిని దూషించి విధులకు ఆటంకం కలిగించారని ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనపై పోలీస్ ఇన్‌స్పెక్టర్ అరుణ్ సాలుంకే ఫిర్యాదు మేరకు బెంగళూరు కబ్బన్ పార్క్ పోలీస్ స్టేషన్‌లో వికాస్ మర్మత్‌తో పాటు అభయ్ ఉదయ్ సింగ్, నితేష్, రోషన్ అనే మరో ముగ్గురిపై కేసు నమోదు చేశారు. విధుల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగిపై దాడి చేయడం, బెదిరించడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం వంటి పలు సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ గొడవకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్రంగా స్పందించినట్లు తెలుస్తోంది. సీఎం సొంత నియోజకవర్గమైన కుప్పం అభివృద్ధి బాధ్యతలు చూస్తున్న అధికారిపై ఆరోపణలు రావడంతో ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టింది.

## అమెరికాలో.. క్యాన్సర్‌తో
# పోరాడుతూ ఏపీ యువకుడి మృతి

ఉజ్వల భవిష్యత్తు కోసం అమెరికా వెళ్లిన ఓ యువకుడి కథ విషాదంగా ముగిసింది. ఏపీ నుంచి అగ్ర రాజ్యానికి వెళ్లిన కొంత కాలానికే క్యాన్సర్ బారిన పడినట్లు నిర్ధరణ కాగా.. నాలుగేళ్ల పాటు మహమ్మారితో పోరాడినా ఫలితం లేకుండా పోయింది. బుధవారం ఉదయం భరత్ పులిపాటి తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. యువకుడి మృతి పట్ల ఏపీ విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. భరత్ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ 'ఎక్స్' వేదికగా



పోస్టు పెట్టారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన భరత్ ఐదేళ్ల కిందట అమెరికా వెళ్లారు. ఏడాది తర్వాత హెపటో సెల్యులార్ కార్సినోమా బారినపడిన ఆయన.. అక్కడే చికిత్స తీసుకుంటున్నారు. ఇటీవల ఆరోగ్యం విషమించడంతో టెక్సాస్‌లోని ఆసుపత్రిలో చేరారు. మాతృభూమికి వచ్చి కుటుంబసభ్యులలో గడపాలని ఉందని.. అనారోగ్యం దృష్ట్యా ఎయిర్ అంబులెన్స్ సాయం అవసరమని పేర్కొంటూ భరత్ గతంలో వీడియో విడుదల చేశారు. ఆదుకోవాలని ఏపీ ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. దీనిపై స్పందించిన మంత్రి లోకేశ్.. భరత్ కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఆయన ఆరోగ్యం క్షీణిస్తున్న కారణంగా ప్రయాణాలు చేయొద్దని వైద్యబృందం సూచించినట్లు తెలిసిందన్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ క్రమంలోనే భరత్ ప్రాణాలు కోల్పోవడంతో తీవ్ర విషాదం నెలకొంది.

# ప్రియుడి బెయిల్ కోసం డ్రగ్స్ క్యారియర్‌గా మారిన యువతి.. విజయవాడలో అరెస్ట్

- **విజయవాడ రైల్వే స్టేషన్‌లో డ్రగ్స్‌తో పట్టుబడ్డ నాగసౌమ్య**
- **జైల్లో ఉన్న ప్రియుడి బెయిల్ డబ్బుల కోసం కమీషన్‌కు ఒప్పుకున్నట్లు వెల్లడి**
- **బెంగళూరు నుంచి 110 గ్రాముల ఎండీఎంఏ తీసుకొస్తుండగా అరెస్ట్**
- **తప్పించుకున్న ప్రధాన నిందితుడు బషీర్‌ను కూడా పట్టుకున్న పోలీసులు**

జైలులో ఉన్న తన ప్రియుడికి బెయిల్ ఇప్పించేందుకు అవసరమైన డబ్బు సమకూర్చుకునే క్రమంలో డ్రగ్స్ సరఫరా చేస్తూ ఓ యువతి పోలీసులకు పట్టుబడింది. విజయవాడ రైల్వే స్టేషన్‌లో మంగళవారం అర్ధరాత్రి ఆమెను అరెస్ట్ చేసిన పోలీసులు, ఆమె వద్ద నుంచి 110 గ్రాముల ఎండీఎంఏను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిని సైతం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాల ప్రకారం.. విజయవాడ



పటమటకు చెందిన నాగసౌమ్యకు మాదక ద్రవ్యాల అలవాటు ఉంది. ఆమె ప్రియుడు కాశీవర్ధన్ మూడు నెలల క్రితం డ్రగ్స్ సరఫరా కేసులో చిత్తూరులో అరెస్టయి ప్రస్తుతం జైలులో ఉన్నాడు. అతడి బెయిల్ కోసం అవసరమైన నగదు లేకపోవడంతో, నాగసౌమ్య డ్రగ్స్ క్యారియర్‌గా మారాలని నిర్ణయించుకుంది. విజయవాడ కృష్ణలంకకు చెందిన డ్రగ్స్ సరఫరాదారు బషీర్, బెంగళూరు నుంచి డ్రగ్స్ తీసుకొస్తే రూ. 50 వేల కమిషన్ ఇస్తానని నాగసౌమ్యను ప్రలోభపెట్టాడు. దీంతో ఈ నెల 13న ఆమె బెంగళూరులోని యలహంకకు వెళ్లి, అక్కడ ఓ గుర్తుతెలియని వ్యక్తి నుంచి రెండు ప్యాకెట్లలో ఉన్న 110 గ్రాముల ఎండీఎంఏను తీసుకుంది. అనంతరం బెంగళూరుహౌరా ఎక్స్‌ప్రెస్ రైలులో విజయవాడకు బయలుదేరింది. ముందస్తు సమాచారంతో ఈగల్ ఇన్‌స్పెక్టర్ రవీంద్ర, జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ రమణ బృందాలు విజయవాడ రైల్వే స్టేషన్‌లో నిఘా ఉంచాయి. రైలులో పోలీసుల తనిఖీలను గమనించిన నాగసౌమ్య, ఈ విషయాన్ని బషీర్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించడంతో అతడు స్టేషన్ నుంచి పరారయ్యాడు. పోలీసులు నాగసౌమ్యను క్షుణ్ణంగా తనిఖీ చేయగా, ఆమె ప్యాంటు లోపల ప్రత్యేకంగా కుట్టించుకున్న జేబులో దాచిన డ్రగ్స్ ప్యాకెట్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆమెను అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న బషీర్‌ను కూడా బుధవారం విజయవాడలో అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు.

# అబ్దుల్ కలాంకు ఘన నివాళి: స్ఫూర్తి శిఖరమన్న చంద్రబాబు, ఆదర్శమన్న పవన్

- **మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా నివాళులు**
- **దేశ అణు, సాంకేతిక రంగాలకు కలాం దిశానిర్దేశం చేశారన్న చంద్రబాబు**
- **కలాం ఆశయాలను కొనసాగించడమే నిజమైన నివాళి అని పిలుపు**

భారతరత్న, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆయనకు ఘనంగా నివాళులర్పించారు.



ఈ సందర్భంగా దేశాభివృద్ధికి, సమాజానికి కలాం అందించిన అసమాన సేవలను వారు స్మరించుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలాంను "స్ఫూర్తి శిఖరం"గా అభివర్ణించారు. ఆయన ఒక అరుదైన వ్యక్తిత్వమని, భారత అణు, సాంకేతిక రంగాలకు సరికొత్త దిశానిర్దేశం చేసిన దార్శనికుడని కొనియాడారు. కలాం జయంతి సందర్భంగా ఆ మహనీయుడి సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని 'ఎక్స్' వేదికగా ఆయన పిలుపునిచ్చారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తన సందేశంలో.. రామేశ్వరంలోని ఒక సామాన్య కుటుంబంలో జన్మించి, దేశం గర్వించే శాస్త్రవేత్తగా, "ప్రజా రాష్ట్రపతి"గా కలాం ఎదిగిన తీరును కొనియాడారు. ఎస్ఎల్వీ3, అగ్ని, పృథ్వీ క్షిపణుల రూపకల్పన, పోఖ్రాన్2 అణు పరీక్షలు, టెక్నాలజీ విజన్ 2020 వంటి కీలక ఘట్టాలలో ఆయన పోషించిన అద్వితీయ పాత్రను ఈ సందర్భంగా గుర్తుచేశారు. సామాన్య నేపథ్యం ఉన్నత లక్ష్యాల సాధనకు అడ్డంకి కాదని కలాం జీవితం నిరూపిస్తుందన్నారు. శాస్త్రీయ దృక్పథం, స్వయం సమృద్ధి, నిరంతర అభ్యాసం వంటి ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన గౌరవమని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

## నారాయణపేటలో దారుణం
## పెట్రోల్ పోసి భర్తను సజీవ దహనం చేసిన భార్య

- **వివాహేతర సంబంధం నేపథ్యంలో భర్తను హత్య చేసిన భార్య**
- **నారాయణపేట జిల్లా మరికల్ మండలంలో జరిగిన దారుణ ఘటన**
- **నిద్రిస్తున్న భర్తపై పెట్రోల్ పోసి నిప్పంటించి దాడి**
- **ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బాధితుడు మృతి**
- **నేరం అంగీకరించిన నిందితురాలు.. కేసు నమోదు చేసిన పోలీసులు**

వివాహేతర సంబంధం ఒక కుటుంబంలో తీరని విషాదాన్ని నింపింది. భర్త మరో మహిళతో సంబంధం పెట్టుకున్నాడన్న ఆగ్రహంతో రగిలిపోయిన భార్య, పెట్రోల్ పోసి నిప్పంటించి అతడిని దారుణంగా హత్య చేసింది. ఈ ఘోరం తెలంగాణలోని నారాయణపేట జిల్లా మరికల్ మండలంలో చోటుచేసుకుంది. మరికల్ మండలం మద్వార్ గ్రామానికి చెందిన బాలస్వామి (46), తెలపల్లి రాములమ్మ దంపతులకు 28 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే, బాలస్వామి అదే గ్రామానికి చెందిన మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న రాములమ్మ భర్తను పలుమార్లు నిలదీసింది. ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య గత కొంతకాలంగా



తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే సెప్టెంబర్ 24వ తేదీ రాత్రి బాలస్వామి ఇంట్లో నిద్రిస్తుండగా, రాములమ్మ ఈ ఘాతుకానికి పాల్పడింది. వ్యవసాయ పనుల కోసం ఇంట్లో నిల్వ ఉంచిన పెట్రోల్‌ను భర్తపై పోసి నిప్పంటించింది. తీవ్ర గాయాలతో హాహాకారాలు చేసిన బాలస్వామిని గమనించిన స్థానికులు, చికిత్స నిమిత్తం తొలుత మహబూబ్‌నగర్ ఆసుపత్రికి తరలించారు. అనంతరం పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ సెప్టెంబర్ 25న అతను మృతి చెందాడు. ఈ ఘటనపై డీఎస్పీ నల్లపు లింగయ్య మాట్లాడుతూ, మృతుడి నుంచి సేకరించిన మరణ వాంగ్మూలం, ఇతర సాక్ష్యాధారాలు ఆధారంగా రాములమ్మను విచారించగా, ఆమె నేరాన్ని అంగీకరించినట్లు తెలిపారు. నిందితురాలిపై భారతీయ న్యాయ సంహిత కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఆయన వెల్లడించారు.

## 24 లక్షల ఎకరాల అటవీ భూమి ఏమైంది? : ప్రభుత్వానికి బీజేపీ నేత సూటి ప్రశ్న

తెలంగాణలో దాదాపు 24 లక్షల ఎకరాల అటవీ భూమి లెక్కల్లో వ్యత్యాసం కనిపిస్తోందని, ఆ భూమి ఏమైందో ప్రభుత్వం స్పష్టం చేయాలని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో లక్షలాది ఎకరాల ప్రభుత్వ, అసైన్డ్ భూములు అన్యాక్రాంతమవుతున్నాయని, ప్రముఖ నాయకులే ఈ భూకబ్జాలకు పాల్పడుతున్నారని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. నేడు హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో, పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా భూముల అక్రమాలకు సంబంధించిన గణాంకాలను ఆయన వివరించారు.

# కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు ప్రత్యేకంగా నీటి సరఫరా..!

- **కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు ప్రత్యేక నీటి సరఫరా ఉందంటూ సీఎం ఆగ్రహం**
- **ఈ వ్యవహారంపై విచారణ జరిపించేందుకు సిద్ధమని ప్రకటన**
- **ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో తీవ్ర నీటి, విద్యుత్ కొరత తప్పదని వ్యాఖ్య**
- **యాసంగిలో వరి సాగు చేయవద్దని రైతులకు ముఖ్యమంత్రి సూచన**
- **కాళేశ్వరం అవినీతితో లక్ష కోట్ల నష్టం జరిగిందని ఆరోపణ**

రాష్ట్రంలో ప్రజలు, రైతులు తీవ్ర నీటి ఎద్దడితో సతమతమవుతుంటే, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తన ఫామ్‌హౌస్‌కు మాత్రం ప్రత్యేకంగా నీటిని తరలించుకుంటున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. మంత్రులతో కలిసి రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావంపై సమీక్ష నిర్వహించిన అనంతరం రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కొండపోచమ్మ సాగర్ నుంచి పంచపాండవుల చెరువుకు కాలువ తవ్వి, అక్కడి నుంచి ప్రత్యేక మోటార్ల ద్వారా కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు నీటిని పంపింగ్ చేస్తున్నారని ఆరోపించారు. "రాష్ట్రంలో మరెవ్వరికీ లేని ఈ ప్రత్యేక సౌకర్యం ఒక్క కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు మాత్రమే ఎందుకు కల్పించారు? ఈ నీటి తరలింపుపై నిజనిర్ధారణ విచారణ జరిపించడానికి మేము సిద్ధంగా ఉన్నాం" అని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో కమీషన్ల కోసం లక్ష కోట్ల



రూపాయల ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేశారని, మేడిగడ్డ బ్యారేజీని కూల్చి మళ్లీ నిర్మించాలని కేంద్ర నిపుణులు సూచించారని రేవంత్ రెడ్డి తెలిపారు. 2015లో కృష్ణా జలాల్లో తెలంగాణ వాటాను 299 టీఎంసీలకు తగ్గించి సంతకాలు చేసింది ఎవరని ఆయన ప్రశ్నించారు. గత దశాబ్ద కాలంలో కృష్ణా బేసిన్‌లో ఒక్క ప్రాజెక్టునైనా పూర్తి చేశారా? అని ఆయన నిలదీశారు.

# ఫిబ్రవరి నాటికి ఎల్‌నినో ప్రభావం తీవ్ర స్థాయికి: తెలంగాణ సీఎస్ సంజయ్ జాజు

- **ఉష్ణోగ్రతలు 2-3 డిగ్రీలు పెరిగాయని సీఎస్ వెల్లడి**
- **పంటలకు రానున్న 15-20 రోజులు కీలకం**
- **భూగర్భ జలమట్టాలు పడిపోవడంపై ఆందోళన**
- **తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశం**
- **ప్రతి జిల్లాకు నోడల్ అధికారులు**
- **సింగూరు, మంజీరా జలాశయాల నీటి వినియోగంపై ప్రత్యేక దృష్టి**

తెలంగాణలో ఎల్‌నినో ప్రభావం ప్రస్తుతం తీవ్రంగా ఉందని, 2027 ఫిబ్రవరి నాటికి అది గరిష్ఠ స్థాయికి



చేరే అవకాశం ఉందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో రుతుపవనాలపై గణనీయమైన ప్రభావం పడిందని, ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీల వరకు పెరిగాయని చెప్పారు. సంగారెడ్డి జిల్లాలోని సింగూరు జలాశయాన్ని గురువారం సందర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో తాగునీటి లభ్యత, సాగులో ఉన్న పంటల పరిస్థితిని అంచనా వేయడానికి క్షేత్రస్థాయి పర్యటన చేపట్టినట్లు వివరించారు. ప్రస్తుత పరిస్థితులపై గురువారం సాయంత్రం జరిగే మంత్రివర్గ సమావేశంలో విస్తృతంగా చర్చించనున్నట్లు వెల్లడించారు. రానున్న 15 నుంచి 20 రోజులు పంటలకు అత్యంత కీలకమని సీఎస్ పేర్కొన్నారు. పంటలను కాపాడేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భూగర్భ జలమట్టాలు గణనీయంగా పడిపోవడంతో విద్యుత్ సరఫరా ఉన్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో నీరు అందుబాటులో ఉండకపోవచ్చని తెలిపారు. అందువల్ల తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ప్రతి జిల్లాకు నోడల్ అధికారులను నియమిస్తున్నట్లు వెల్లడించారు. జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో విద్యుత్, వ్యవసాయ శాఖల అధికారులు రైతులకు అందుబాటులో ఉండి, పరిస్థితులకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. వ్యవసాయ అవసరాలకు నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖను ఆదేశించారు. సింగూరు, మంజీరా జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గుతున్న నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించాలని సీఎస్ సూచించారు. హైదరాబాద్‌తో పాటు సంగారెడ్డి, కామారెడ్డి, నిజామాబాద్, మెదక్ జిల్లాలకు తాగునీటి సరఫరాలో అంతరాయం కలగకుండా రూపొందించిన ప్రణాళికలను సమర్థంగా అమలు చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. రాబోయే 15 రోజుల నీటి లభ్యతను అంచనా వేసి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వాతావరణ మార్పులు పంటలపై చూపే ప్రభావాన్ని వ్యవసాయ, విద్యుత్, సాగునీటి శాఖలు ఎప్పటికప్పుడు పరిశీలించాలని చెప్పారు. అధికారులు క్షేత్రస్థాయిలో రైతులు, స్థానిక ప్రజలను కలిసి వారి అవసరాలను తెలుసుకోవాలని, ప్రభుత్వం చేపడుతున్న ముందస్తు చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

# సర్వభూపాల వాహనంపై వేణుగోపాలస్వామి

తిరుమల: తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా నాలుగో రోజు గురువారం రాత్రి శ్రీ మలయప్పస్వామివారు రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి అలంకారంలో సర్వభూపాల వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. తిరుగిరులపై విహరించి భక్తులను అనుగ్రహించారు. మంగళవాయిద్యాల నడుమ వాహనసేవ అంగరంగ వైభవంగా సాగింది. ఆ ఫొటోలు..












పత్రికతో.. మార్పులు
TN తెలుగు న్యూస్ దిన పత్రిక
మా కలం మీ గళం.. సామాన్యుని గుండె చప్పుడు..



# ఇంటర్నెట్ నిలిపివేత: సుప్రీంకోర్టుకు కేంద్ర హోం సెక్రటరీ బేషరతు క్షమాపణ

- కోర్టు ధిక్కరణ కేసులో అఫిడవిట్ దాఖలు
- రైసీనా హిల్స్ పరిధిలో 24 గంటల పాటు సెల్యులర్ సేవలు నిలిపివేసినట్టు వెల్లడి
- సీఈసీ రాజీనామా కోరుతూ తలపెట్టిన ఆందోళనల నేపథ్యంలో ఈ నిర్ణయం
- ఆందోళనలకు అనుమతి నిరాకరించినట్టు తెలిపిన ఢిల్లీ పోలీస్ కమిషనర్

దేశ రాజధాని ఢిల్లీలో నిరసనల సందర్భంగా ఇంటర్నెట్ సేవల నిలిపివేతకు సంబంధించి దాఖలైన కోర్టు ధిక్కరణ కేసులో కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ఈ వ్యవహారంపై కేంద్ర హోం శాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ సుప్రీంకోర్టుకు బేషరతుగా క్షమాపణలు తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం అత్యున్నత న్యాయస్థానంలో అఫిడవిట్ దాఖలు చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) అక్టోబర్ 10న ఢిల్లీలో భారీ నిరసనలకు పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం అధికారులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా అక్టోబర్ 9వ తేదీ రాత్రి 10 గంటల నుంచి అక్టోబర్ 10 రాత్రి 10 గంటల వరకు, అంటే 24 గంటల పాటు రైసీనా హిల్స్ పరిసరాల్లోని 4 కిలోమీటర్ల వ్యాసార్థంలో సెల్యులర్ ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. అయితే, వైఫై, బ్రాడ్‌బ్యాండ్ వంటి సేవలకు ఎలాంటి అంతరాయం కలిగించలేదని హోం సెక్రటరీ తన అఫిడవిట్‌లో స్పష్టం చేశారు. శాంతిభద్రతల దృష్ట్యా ఢిల్లీ పోలీసులు చేసిన అభ్యర్థన మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వివరించారు. కాగా, నిరసనల సందర్భంగా మెట్రో, రైళ్లు సహా ఇతర అత్యవసర సేవలను పూర్తిగా నిలిపివేయవద్దని సుప్రీంకోర్టు గతంలో ఆదేశాలు జారీ చేసింది. ఇంటర్నెట్ సేవలను నిలిపివేయడం ఈ ఆదేశాలను ఉల్లంఘించడమేనంటూ కోర్టులో ధిక్కరణ పిటిషన్ దాఖలైంది. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం, కేంద్ర హోం కార్యదర్శి, ఢిల్లీ పోలీస్ కమిషనర్ సహా ఇతర ఉన్నతాధికారులకు నోటీసులు జారీ చేసింది. ఈ కేసులోనే హోం సెక్రటరీ తాజాగా క్షమాపణలు



చెబుతూ అఫిడవిట్ సమర్పించారు. మరోవైపు, ఢిల్లీ పోలీస్ కమిషనర్ అనురాగ్ కుమార్ సైతం తన అఫిడవిట్‌ను కోర్టుకు సమర్పించారు. జులై 20న జరిగిన నిరసనల్లో హింసాత్మక ఘటనలు చోటుచేసుకోవడం, నిరసనకారులను నియంత్రించడం కష్టతరంగా మారడం, సామాన్య ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలగడం వంటి కారణాలతో అక్టోబర్ 10న తలపెట్టిన ఆందోళనలకు అనుమతి నిరాకరించినట్లు ఆయన తెలిపారు. ఈ అఫిడవిట్‌లను పరిశీలించిన అనంతరం సుప్రీంకోర్టు తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకోనుంది.

## కేంద్రంపై అభిజీత్ దీప్కే విమర్శలు

సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌ను కాపాడేందుకు ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా ప్రయత్నిస్తున్నారని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఆరోపించారు. అందుకే నిరసనలు చేస్తున్న వారిని, ప్రతిపక్ష నాయకులను టార్గెట్ చేస్తున్నారని విమర్శించారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఆయన.. ఈ ప్రభుత్వం సొంత ప్రజలపైనే యుద్ధం చేస్తుందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "ఢిల్లీ వీధుల్లో శాంతియుతంగా



నిరసనలు చేస్తున్న విద్యార్థులను ఎందుకు నిర్బంధిస్తున్నారు? మమతా బెనర్జీ, కేజ్రీవాల్ సహా పలువురు కీలక నేతలనూ నిర్బంధించారు. నిరసనకారులను అరెస్టు చేయడానికి అధికార యంత్రాంగాన్ని కేంద్ర ప్రభుత్వం వాడుకుంటోంది. నిరసనల వేళ రైళ్లను రద్దు చేశారు. ప్రత్యేక భద్రతా బలగాలను రంగంలోకి దించారు. ఈ చర్యలు చూస్తుంటే ఎవరినో రక్షించడానికి ప్రయత్నిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను కాపాడేందుకేనా?" అని అభిజీత్ దీప్కే ప్రశ్నించారు.

## అమెరికాలో ఆలయంపై దాడికి కుట్ర.. స్పందించిన భారత్

అమెరికాలో హిందూ ఆలయంలో కాల్పులకు కుట్రపన్నిన ఘటనపై భారత ప్రభుత్వం స్పందించింది . అది పూర్తిగా హిందూ వ్యతిరేక ఘటన అని ఆందోళన వ్యక్తంచేసింది. ఈ కుట్ర కేసుపై విదేశాంగశాఖ ప్రతినిధి రణధీర్ జయస్వాల్ మీడియాతో మాట్లాడారు. " ఇల్లినోయిాలోని అరోరా శివారు ప్రాంతంలోని హిందూ ఆలయాన్ని లక్ష్యంగా చేసుకొని కాల్పుల కుట్రకు సంబంధించిన నివేదికలు మా దృష్టికి వచ్చాయి. ఆ కుట్ర ఘటన తీవ్ర కలవరానికి గురిచేసింది. దాని వెనక జాతి వివక్ష, హిందూ వ్యతిరేక స్వభావం ఉన్నట్లు తెలుస్తోంది. భారతీయుల భద్రతకు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది" అని జయస్వాల్ పేర్కొన్నారు. భారతీయులను లక్ష్యంగా చేసుకుని కాల్పులు జరిపే ఉద్దేశంతో నిందితుడు అలెగ్జాండ్రోస్ పపోరాకిస్ ఆలయానికి వెళ్లినట్లు పోలీసులు దర్యాప్తులో అధికారులు గుర్తించారు. అయితే, రైఫిల్ జామ్ అవడంతో కుట్ర విఫలమైనట్లు పేర్కొన్నారు. రెస్టారెంట్‌లో తనతో పాటు పనిచేసే ఓ ఫ్రెండ్‌కు ఫోన్ చేసి కాల్పులు జరపాలనుకున్న విషయాన్ని, తుపాకీ జామ్ అయిన సంగతిని చెప్పడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది.



## జర్నలిస్టులా.. రీల్స్ చేసేవాళ్లా? తెలియట్లేదు
## ఢిల్లీ ఆందోళనలపై కేంద్రం

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ ఇటీవల ఢిల్లీలో జరిగిన ఆందోళనల సమయంలో కొందరు మహిళా జర్నలిస్టులపై వేధింపులు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో నిరసనల వేళ మహిళా విలేకరులకు రక్షణ కల్పించాలని కోరుతూ సుప్రీంకోర్టు లో పిటిషన్ దాఖలైంది. దీనిపై విచారణ సందర్భంగా సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ మధ్య జర్నలిస్టులెవరో.. రీల్స్ చేసే వాళ్లు ఎవరో తెలియట్లేదని అన్నారు. "ఆందోళనల సమయంలో చాలా మంది మైక్ పట్టుకుని కన్పిస్తున్నారు. వీడియోలు రికార్డ్ చేసి రీల్స్ అప్‌లోడ్ చేస్తామని కొందరు చెబుతున్నారు. జర్నలిస్టులమని మరికొందరు అంటున్నారు. ఈ టెక్నాలజీ యుగంలో రీల్స్ చేసేవాళ్లు ఎవరో.. స్వతంత్ర జర్నలిస్టులు ఎవరో తెలుసుకోవడం కష్టంగా మారుతోంది. అయితే, వృత్తి ఏదైనా సరే.. మహిళల భద్రత విషయంలో రాజీ పడేది లేదు. మహిళా పోలీసు సిబ్బంది నుంచి సామాన్య మహిళల వరకు ఎవరూ అసభ్య ప్రవర్తనకు




గురికాకూడదు" అని కేంద్రం తరఫున తుషార్ మెహతా పేర్కొన్నారు. ఇరు పక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. మహిళా జర్నలిస్టులపై పోలీసుల వేధింపుల ఆరోపణలు చాలా తీవ్రమైన అంశమని అభిప్రాయపడింది. దీనిపై విచారణకు కమిటీని ఏర్పాటు చేసే విషయాన్ని పరిశీలిస్తామని వెల్లడించింది. కమిటీలో రిటైర్డ్ మహిళా న్యాయమూర్తులు, విశ్రాంత ఐపీఎస్ అధికారులు ఉంటారని పేర్కొంది.

## మళ్లీ వార్తల్లోకి అంకిత కేసు.. ఇండియా గేట్ వద్ద తల్లిదండ్రుల నిర్బంధం

ఒక రిసార్టులో రిసెప్షనిస్టుగా చేరిన నెలరోజులకే అదృశ్యమై కెనాల్‌లో విగతజీవిగా కనిపించిన అంకితా భండారీ (Ankita Bhandari) కేసు మరోసారి వార్తల్లో నిలిచింది. తమ కుమార్తె మృతి కేసులో న్యాయం చేయాలంటూ బుధవారం అంకిత తల్లిదండ్రులు ఢిల్లీలోని ఇండియా గేట్ వద్ద నిరసనలు చేపట్టగా.. గురువారం తెల్లవారుజామున పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నిరసనలకు కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ మద్దతు తెలిపిన సంగతి తెలిసిందే. భాజపా నేత దుష్యంత్ కుమార్ గౌతమ్‌ను సిక్కిం గవర్నర్‌గా నియమించడమే ఈ నిరసనలకు కారణం. ఉత్తరాఖండ్‌లోని పౌడీ గఢ్వాల్ జిల్లా డోబ్‌శ్రీకోట్ గ్రామానికి చెందిన అంకితా భండారీ (19) రుషికేశ్ సమీపంలోని ఒక రిసార్టులో 2022 ఆగస్టులో రిసెప్షనిస్టుగా చేరింది. ఆ రిసార్టును అప్పటి భాజపా సీనియర్ నేత వినోద్ ఆర్య కుమారుడు పులకిత్ ఆర్య నిర్వహించేవాడు. విధుల్లో చేరిన నెల రోజులకే అంకిత కనిపించకుండా పోయింది. రిసార్టుకు వచ్చే వీఐపీ అతిథుల కోసం 'ప్రత్యేక సేవలు' చేయడానికి నిరాకరించడం ఆమె ప్రాణాల మీదకు తెచ్చినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ 'ప్రత్యేక సేవల' విషయంలో పులకిత్‌తోపాటు అతడి ఇద్దరు సహాయకులు ఆమెపై తీవ్ర ఒత్తిడి తెచ్చారు. అది చివరకు ఘర్షణకు దారి తీసింది.



అంకిత (Ankita Bhandari)ను బలవంతంగా ఒక వాహనంలో తీసుకువెళ్లి, రుషికేశ్ సమీపంలోని చిల్లా కెనాల్‌లో పడేశారు. తర్వాత ఏమీ తెలియనట్లు వెనక్కు వచ్చేశారు. రిసార్టులో జరుగుతున్నదంతా అంకిత తన స్నేహితుడికి ముందే చెప్పి ఉండటంతో.. ఆమె కుటుంబ సభ్యులతో కలిసి అతడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆరు రోజుల తర్వాత కాలువలో అంకిత మృతదేహాన్ని గుర్తించారు. ఈ కేసులో ముగ్గురు దోషులకు న్యాయస్థానం జీవితఖైదు విధించింది. ఆ వీఐపీ దుష్యంత్ అని మృతురాలి తండ్రి గతంలో ఆరోపించారు. అంకిత హత్య కేసులో ప్రస్తుతం సీబీఐ (CBI) దర్యాప్తు కొనసాగుతోంది. ఇలాంటి సమయంలో దుష్యంత్ గౌతమ్‌ను సిక్కిం గవర్నర్‌గా నియమించడం ద్వారా కేంద్ర ప్రభుత్వం ఆయనకు ఈ కేసు నుంచి రాజ్యాంగ రక్షణ కల్పించిందని, దర్యాప్తును నీరుగార్చిందని ఆమె కుటుంబం, విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఆ నియామకాన్ని వ్యతిరేకిస్తూ అంకిత కుటుంబ సభ్యులు ఇండియా గేట్ వద్ద నిరసనకు దిగారు. వారిని తెల్లవారుజామున పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తర్వాత వారిని తిలక్ మార్గ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం విడుదల చేశారు. తల్లిదండ్రులతో పాటు పోలీసులు అదుపులోకి తీసుకున్నవారిలో పవన్ ఖేడా, జోతిమణి, ఇమ్రాన్ ప్రతాప్‌గఢీ ఉన్నారు. వారంతా స్టేషన్‌లోనే నిరసన చేపట్టారు. ఆరోపణలు ఎదుర్కొన్న వ్యక్తి గవర్నర్ అయితే.. మృతురాలి తల్లిదండ్రులను జైలుకు పంపుతారా..? విపక్ష నేతలు ప్రశ్నించారు. తనపై వచ్చిన ఆరోపణలను ఇప్పటికే దుష్యంత్ ఖండించారు.

## కోలుకుంటున్న పోప్

రోమ్: ఊపిరితిత్తుల్లో పెరిగిన క్యాన్సర్ కణితిని తొలగించేందుకు శస్త్ర చికిత్స చేయించుకున్న పోప్ లియో 14 మెల్లగా కోలుకుంటున్నారు. మంగళవారం శస్త్ర చికిత్స చేయించుకున్న వాటికన్ అధినేత బుధవారంకల్లా నడక, ఊపిరితిత్తుల కసరత్తులు ప్రారంభించారని, క్రమబద్ధంగా ఆహారం తీసుకుంటున్నారని వైద్యులు తెలిపారు. శస్త్ర చికిత్స అనంతరం ఆయన కోలుకుంటున్న పద్ధతి సజావుగా ఉన్నట్టు ఎక్స్‌రే, రక్త పరీక్షలు తెలియజేస్తున్నాయని వెల్లడించారు. 71 సంవత్సరాల పోప్ అడినో కార్సినోమా అనే సాధారణ ఊపిరితిత్తుల క్యాన్సర్ బారినపడ్డారు. ఈ వ్యాధి ఇతర శరీర భాగాలకు



వ్యాప్తి చెందిందా అన్నది గుర్తించేందుకు ఇంకా వైద్య పరీక్షలు నిర్వహించాల్సి వుంది. పోప్ లియో 14కు నిర్వహించిన శస్త్ర చికిత్స విజయవంతం కావడంపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు.

## హర్మూజ్‌లో కుప్పలుగా తేలియాడుతున్న ఐఫోన్లు!

హర్మూజ్ జలసంధిలో ఓ కార్గో నౌక మునిగిపోయింది. సీమైన్‌ను ఢీకొనడంతో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కోర్ వెల్లడించింది. అయితే, మైన్‌ను ఢీకొట్టి నౌక మునిగిపోయినట్లుగా ఐఆర్‌జీసీ ప్రకటించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. చట్ట విరుద్ధమైన, ప్రమాదకర మార్గంలో నౌక ప్రయాణిస్తున్న క్రమంలో ఈ ఘటన చోటుచేసుకుందని అధికారులు చెప్పినట్లు స్థానిక మీడియా పేర్కొంది. ప్రమాదానికి గురైన నౌక దాదాపు 2500 కంటైనర్లతో వెళ్తున్నట్లు సమాచారం. వీటిలో ఐఫోన్లు, లగ్జరీ పెర్ఫ్యూమ్ బాటిళ్లు, తదితర వస్తువులున్నాయి. ప్రమాదం అనంతరం కంటైనర్లు చెల్లాచెదురు కాగా.. అందులోని ఐఫోన్‌లు సహా ఇతర వస్తువులు కుప్పలుగా నీటిపై తేలియాడుతున్న దృశ్యాలు కనిపించాయి. జీఎఫ్‌ఎస్ ప్రైడ్ అనే సింగపూర్ జెండా ఉన్న నౌక దుబాయ్ నుంచి ఈ సరకులను



తీసుకువెళ్తున్నట్లు తెలుస్తోంది. హర్మూజ్ మార్గంలో వెళ్తున్న సమయంలో సింగపూర్‌కు చెందిన రెండు సరకు రవాణా నౌకలు గుర్తు తెలియని వస్తువులను ఢీకొన్నాయని నౌకాశ్రయ అధికారులు తొలుత పేర్కొన్నారు. ఇందులో ఒకటి మునిగిపోగా.. మరొకటి సురక్షితంగా గమ్యాన్ని చేరుకున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో మొదటి నౌకలోని సిబ్బంది అందర్నీ సురక్షితంగా తరలించామని, ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదని సింగపూర్ పోర్టు అధికారులు వెల్లడించారు.

## ధరల పెంపు కంటే కొత్త సేవలపైనే దృష్టి.. ఐపీఓ ముందు ఆకాశ్ అంబానీ కీలక ప్రకటన

- టారిఫ్ పెంపు కంటే సేవల విస్తరణ ద్వారా ఆదాయం పెంచుకుంటామన్న ఆకాశ్ అంబానీ
- ధరలు పెంచే అవకాశం ఉన్నా, అదే ప్రధాన మార్గం కాదని స్పష్టీకరణ
- భారీ ఐపీఓకి సిద్ధమవుతున్న నేపథ్యంలో జియో భవిష్యత్ వ్యూహం వెల్లడి
- ప్రస్తుతం పరిశ్రమ సగటు కంటే తక్కువ ధరకే జియో డేటా అందిస్తోందన్న ఆకాశ్

దేశంలోనే అతిపెద్ద పబ్లిక్ ఇష్యూకు సిద్ధమవుతున్న జియో ప్లాట్‌ఫామ్స్ తన భవిష్యత్ వ్యూహాలపై కీలక ప్రకటన చేసింది. కేవలం మొబైల్ టారిఫ్ ధరలు పెంపు ద్వారానే కాకుండా, వినియోగదారులకు వినూత్న సేవలను చేరువ చేయడం ద్వారా ఆదాయాన్ని వృద్ధి చేసుకోవడమే తమ ప్రధాన లక్ష్యమని జియో ప్లాట్‌ఫామ్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఆకాశ్ అంబానీ స్పష్టం చేశారు. అయితే, మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా ధరల పెంపు అనేది ఎప్పుడూ ఒక ప్రత్యామ్నాయంగా ఉంటుందని ఆయన పరోక్షంగా సంకేతాలిచ్చారు. గురువారం ముంబైలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆకాశ్ అంబానీ కంపెనీ వృద్ధి ప్రణాళికలను వివరించారు. "టెలికాం రంగంలో టారిఫ్ ధరల పెంపు అనేది ఎప్పుడూ అందుబాటులో ఉండే ఒక అవకాశం. పరిస్థితులను బట్టి దానిపై నిర్ణయాలు ఉంటాయి. అయితే, రిలయన్స్ జియో వ్యూహం కేవలం డేటా ధరలపైనే ఆధారపడి ఉండదు. వినియోగదారులకు అదనపు విలువ కలిగిన సేవలను అందించి, తద్వారా రాబడిని పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నాం" అని ఆయన వెల్లడించారు. టారిఫ్ పెంపు ఎప్పుడు ఉండవచ్చు అన్న ప్రశ్నకు ఆయన స్పష్టమైన గడువు ఏదీ ప్రకటించనప్పటికీ, ధరల సర్దుబాటుకు తగిన ఆస్కారం ఉందని అంగీకరించారు. "ప్రస్తుతం దేశ తలసరి ఆదాయంలో టెలికాం సేవలకు వినియోగదారులు వెచ్చిస్తున్న ఖర్చు 1 శాతం కంటే తక్కువగానే ఉంది. 2016లో జియో అరంగేట్రం చేసిన నాటితో పోలిస్తే ఈ వ్యయం దాదాపు సగానికి తగ్గింది" అని ఆయన గుర్తుచేశారు. ఇది భవిష్యత్తులో ధరల పెంపునకు సంకేతంగా మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ్రస్తుతం టెలికం రంగంలో సగటున ఒక జీబీ డేటాకు రూ. 7.5 వసూలు చేస్తుండగా, జియో మాత్రం రూ. 4.9 మాత్రమే వసూలు చేస్తోందని ఆకాశ్ అంబానీ పేర్కొన్నారు.






# గుర్తుతెలియని కాల్స్‌కు చెక్.. ఇక, కాలర్ ఐడీ డిస్‌ప్లే తప్పనిసరి!

స్పామ్, గుర్తు తెలియని నంబర్ల నుంచి వచ్చే కాల్స్ బెడదకు చెక్ పెట్టే సమయం ఆసన్నమైంది. ట్రూకాలర్ వంటి థర్డ్ పార్టీ యాప్‌ల అవసరం లేకుండానే మీ ఫోన్‌లో అవతలి వ్యక్తి పేరు చూపించే కాలర్ ఐడీ సదుపాయం రానుంది. ఇందుకోసం కాలర్ నేమ్ ప్రజెంటేషన్‌ను కేంద్రం తప్పనిసరి చేసింది. నవంబర్ 1 నుంచి దీన్ని అమల్లోకి తీసుకురావాలని టెలికాం సర్వీస్ ప్రొవైడర్లను ట్రాయ్ ఆదేశించింది. దీంతో గుర్తు తెలియని వ్యక్తి నుంచి కాల్ రాగానే వారి నంబర్‌తో పాటు పేరు కూడా ఫోన్ డిస్‌ప్లేపై కనిపిస్తుంది. 4జీ, 5జీ తదితర హైస్పీడ్ మొబైల్ నెట్‌వర్క్‌లకు మాత్రమే CNAP సదుపాయం అందుబాటులోకి రానుంది. 2జీ, 3జీకి ఈ సేవలను తీసుకురావడంపై ట్రాయ్ వివరాలు వెల్లడించలేదు. మన కాంటాక్ట్ లిస్ట్‌లో లేని నంబర్ల నుంచి ఫోన్ వచ్చినప్పుడు మాత్రమే పేరు డిస్‌ప్లే అవుతుంది. టెలికాం ఆపరేటర్ల సబ్‌స్క్రైబర్ డేటా బేస్‌లో నమోదైన కాలర్ పేరు, నంబర్ మన స్క్రీన్‌పై కనిపిస్తుంది. అంతర్జాతీయ కాల్స్ విషయానికొస్తే.. పేరుకు బదులుగా ఇంటర్నేషనల్ కాల్ అని చూపిస్తుంది. ఇన్‌కమింగ్ కాల్స్ ముగిశాక అవతలి వ్యక్తి నంబర్‌ను పేరుతో పాటు రిట్రీవ్ చేసి సేవ్ చేసుకునే వీలుండదు. మాన్యువల్‌గా సేవ్ చేయాల్సి ఉంటుంది. అయితే, కాలింగ్ లైన్ ఐడెంటిఫికేషన్




రిస్ట్రిక్షన్ ఆప్షన్‌ను చందాదారులు ఎంపిక చేసుకుంటే వారి పేరు డిస్‌ప్లేపై చూపించదు.

## మార్కెట్‌లోకి మహీంద్రా XUV 3XO CNG..
## ధర రూ.9.99 లక్షల నుంచి ప్రారంభం

ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ మహీంద్రా అండ్ మహీంద్రా తమ పాపులర్ ఎస్‌యూవీ XUV 3XOలో సీఎన్‌జీ వేరియంట్‌ను మార్కెట్లోకి విడుదల చేసింది. దీన్ని ఎక్స్‌యూవీ 3ఎక్స్‌ఓ ZNGగా వ్యవహరించనున్నారు. దీని ధర రూ.9.99 (ఎక్స్‌షోరూమ్) నుంచి ప్రారంభమవుతుంది. టాప్ స్పెక్స్ కలిగిన వేరియంట్ ధర రూ.12.27 లక్షలుగా కంపెనీ నిర్ణయించింది. ఇప్పటికే పెట్రోల్, డీజిల్, ఎలక్ట్రిక్ వెర్షన్లను కంపెనీ లాంచ్ చేసింది. అక్టోబర్ 20 నుంచి బుకింగ్‌లు ప్రారంభం కానున్నాయి. ఇందులో 1.2లీటర్ టర్బోఛార్జ్ MPFI పెట్రోల్ ఇంజిన్ అమర్చారు. సీఎన్‌జీ మోడ్‌లో 114 bhp పవర్, 200 Nm టార్క్ అందిస్తుంది. సీఎన్‌జీ మోడ్‌లో కేజీకి 24.7 కి.మీ. మైలేజీ ఇస్తుందని కంపెనీ పేర్కొంది. కేవలం 4.9 సెకన్లలో 0 నుంచి 60 కి.మీ. వేగాన్ని, 11.8 సెకన్లలో 0 నుంచి 100




కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుందని తెలిపింది. ఇందులో ట్విన్ సిలిండర్లను బూట్ ఫ్లోర్ కంటే కింది భాగంలో అమర్చారు. దీంతో మెయిన్ బూట్ స్టోరేజీకి ఎలాంటి ఇబ్బందీ ఉండదు. దీనివల్ల లగేజీ పెట్టుకోవడానికి మంచి స్థలం లభిస్తుంది. స్పేర్ వీల్‌ను కారు బాడీ కింద అమర్చారు. డ్యాష్‌బోర్డ్‌పై పెట్రోల్/సీఎన్‌జీ స్విచ్ బటన్, 6 ఎయిర్‌బ్యాగ్‌లు, నాలుగు చక్రాలకూ డిస్క్ బ్రేకులు తదితర భద్రతా ఫీచర్లు ఉన్నాయి. మారుతీ సుజుకీ బ్రెజ్జా, టాటా నెక్సాన్ సీఎన్‌జీ వేరియంట్లకు ఇది పోటీ ఇవ్వనుంది.

# నేటి నుంచే ఐఫోన్ డ్యుయో ప్రీ ఆర్డర్లు.. డిస్‌ప్లే పగిలితే జేబుకు చిల్లే!

ప్రముఖ టెక్ దిగ్గజం యాపిల్ తొలి ఫోల్డబుల్ ఐఫోన్ డ్యుయో ప్రీ ఆర్డర్లకు సిద్ధమవుతోంది. శుక్రవారం (అక్టోబర్ 16) సాయంత్రం 5 గంటల నుంచి ప్రీ ఆర్డర్లు ప్రారంభం కానున్నాయి. అక్టోబర్ 23 నుంచి విక్రయాలు మొదలవ్వనున్నాయి. ఇప్పటికే డ్యుయో ఖరీదైన ఐఫోన్‌గా నిలిచింది. 256జీబీ వేరియంట్ ప్రారంభ ధర రూ.2,99,900 ఉండగా.. టాప్ వేరియంట్ 2TB ధర రూ.4,49,900గా కంపెనీ నిర్ణయించింది. దీని ధర వెల్లడించిన రోజే దీనికి బదులు 'కొత్త కారే వస్తుంది కదా' అంటూ మీమ్స్ సందడి చేశాయి. తాజాగా డ్యుయో రిపేర్ ఖర్చులు బయటకు రావడంతో ఈ ఫోన్ మరోసారి వార్తలకెక్కింది.



**డిస్‌ప్లే పగిలితే..**

యాపిల్ తన తొలి ఫోల్డబుల్ ఫోన్ డ్యుయోకు సంబంధించిన రిపేర్‌కయ్యే ఖర్చులను తన వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. డిస్‌ప్లే కవర్ లేయర్ రిపేర్ ధర రూ.5,900గా నిర్ణయించింది. బ్యాక్ గ్లాస్ డ్యామేజ్ ధర రూ.20,900, బ్యాటరీ సర్వీస్ ధర రూ.24,900, కెమెరా రిపేర్ రూ.26,900కు వెచ్చించాల్సి ఉంటుంది. ఒకవేళ అవుటర్ డిస్‌ప్లే డ్యామేజ్ అయితే, రూ.42,900, అవుట్ డిస్‌ప్లే+ గ్లాస్ డ్యామేజ్‌కు రూ.55,900 చెల్లించాలి. ఇన్నర్ డిస్‌ప్లే గనక పాడైతే అక్షరాలా రూ.1,49,900 చెల్లించాలి. ఇతర డ్యామేజ్ ధరలను రూ.2,24,900గా నిర్ణయించింది. ఈ రిపేర్ ఖర్చులను చూసి నెటిజన్లు అవాక్కవుతున్నారు. ఇన్నర్ డిస్‌ప్లే పొరపాటున పాడైతే.. దానికి పెట్టే ఖర్చుతో ఏ ఐఫోన్ 18ప్రోనో, శాంసంగ్ గెలాక్సీ ఎస్26 అల్ట్రానో కొనుగోలు చేయొచ్చంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు.

## బుల్ జోష్.. సెన్సెక్స్ 1500 పాయింట్లు పైకి

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. ఐటీ, బ్యాంకింగ్, ఆటో స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతు సూచీలకు దన్నుగా నిలిచాయి. చమురు ధరలు కాస్త తగ్గడమూ సూచీలకు కలిసొచ్చింది. సెన్సెక్స్ 1533.72 పాయింట్లు ఎగబాకి 74,315.61 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 374.65 పాయింట్లు లాభపడి 22,997.35 వద్ద ముగిసింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 0.1 శాతం పెరిగి 95.04గా ఉంది. సెన్సెక్స్ 30లో హిందుస్థాన్ యునిలీవర్, ట్రెంట్, బీఈఎల్ షేర్లు తప్ప మిగతా కంపెనీల షేర్లన్నీ లాభాల్లో ముగిశాయి. టెక్ మహీంద్రా, ఐసీఐసీఐ బ్యాంక్, రిలయన్స్, భారతీ ఎయిర్‌టెల్, ఎటర్నల్, హెచ్‌సీఎల్ టెక్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 103.8 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్స్ ధర రూ.4,155.52 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓ తేదీలను ప్రకటించడంతో రిలయన్స్ షేర్లు దూసుకెళ్లాయి. దాదాపు 3 శాతం మేర కంపెనీ షేర్లు లాభపడ్డాయి.

**కారణాలివే..**

ఐటీ షేర్లలో కొనుగోళ్ల మద్దతు కలిసొచ్చింది. ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్ షేర్లు భారీగా లాభపడ్డాయి. మరోవైపు బ్యాంకింగ్, కన్జూమర్ స్టాక్స్‌లో కొనుగోళ్లూ సూచీలకు కలిసొచ్చింది. అమెరికాలో అంచనాల కంటే వేగంగా పెరుగుతున్న ద్రవ్యోల్బణం వల్ల వడ్డీ రేట్ల విషయంలో కేంద్రబ్యాంకులు కఠినంగా వ్యవహరిస్తాయనే భయాలు ఉన్నాయి.

# రుణ గ్రహీతలకు SBI షాక్.. రుణ రేట్లు పెంపు

ప్రభుత్వరంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (SBI) రుణ రేట్లను పెంచింది. ఎంపిక చేసిన కాలవ్యవధులపై ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ లింక్డ్ రేట్ (EBLR), రెపో లింక్డ్ లెండింగ్ రేట్ (RLLR), మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేట్ (MCLR)ను సవరించింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI) ఇటీవల రెపోరేటును 25 బేసిస్ పాయింట్లు పెంచిన నేపథ్యంలో రుణ రేట్లు పెంచుతూ ఎస్‌బీఐ నిర్ణయం తీసుకుంది. ఎస్‌బీఐ తాజా నిర్ణయంతో ఎంసీఎల్‌ఆర్, ఈబీఎల్‌ఆర్, ఆర్‌ఎల్‌ఎల్‌ఆర్‌తో ముడిపడి ఉన్న రుణాలు ప్రియం కానున్నాయి. దీంతో రుణ గ్రహీతలపై ఈఎంఐ భారం పడనుంది. పెరిగిన రేట్లు అక్టోబర్ 15 నుంచే అమల్లోకి తెస్తున్నట్లు ఎస్‌బీఐ తన వెబ్‌సైట్‌లో పేర్కొంది. EBLR 7.90% నుంచి 8.15% శాతానికి (CRP + BSP అదనం) పెంచింది. RLLRను 7.50% నుంచి 7.75%కి (CRP + BSP అదనం) సవరించింది. సాధారణంగా ఈ రేట్లతో అనుసంధానం అయి ఉన్న గృహ, వాహన రుణాల ఈఎంఐ పెరుగుతుంది. * CRP క్రెడిట్ రిస్క్ ప్రీమియం; BSP బ్యాంక్ స్ప్రెడ్ ఓవర్‌నైట్ ఎంసీఎల్‌ఆర్, ఒక నెల ఎంసీఎల్‌ఆర్‌లో ఎస్‌బీఐ ఎలాంటి మార్పూ చేయలేదు. 7.85 శాతం వద్దే కొనసాగించింది. మూడు నెలల ఎంసీఎల్‌ఆర్ 8.60 శాతం నుంచి 8.75 శాతానికి; ఏడాది ఎంసీఎల్‌ఆర్‌ను 8.70 శాతం నుంచి 8.85 శాతానికి, రెండేళ్లు, మూడేళ్ల ఎంసీఎల్‌ఆర్‌ను 15 బేసిస్ పాయింట్లు పెంచుతూ వరుసగా 8.90 శాతం,




8.95 శాతానికి చేర్చింది. MCLR అనేది బ్యాంకు రుణాలపై వసూలు చేయగల కనీస వడ్డీ రేటును సూచిస్తుంది. ఒక బ్యాంకు తన నిధుల వ్యయం, నిర్వహణ ఖర్చులు, మార్జిన్ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ రేటును నిర్ణయిస్తుంది. సాధారణంగా పాత హోమ్, పర్సనల్ లోన్లు; కార్పొరేట్ రుణాలు ఎంసీఎల్‌ఆర్‌తో ముడిపడి ఉంటాయి.

# కివీస్‌తో వన్డే సిరీస్.. బుమ్రాకి రెస్ట్? కారణమిదేనా?

ప్రస్తుతం టీమ్ఇండియా వెస్టిండీస్‌తో టీ20 సిరీస్‌ను ఆడుతోంది. శనివారం చివరి మ్యాచ్ జరగనుంది. ఇది ముగిసిన తర్వాత.. భారత జట్టు న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లనుంది. అక్కడ ఐదు టీ20లు, ఐదు వన్డేలు, రెండు టెస్టులను ఆడనుంది. ఇప్పటికే టీ20 సిరీస్ కోసం స్క్వాడ్‌ను బీసీసీఐ సెలక్షన్ కమిటీ ప్రకటించింది. మరో రెండు లేదా మూడు రోజుల్లో వన్డే సిరీస్ కోసం జట్టును ప్రకటించే అవకాశం ఉంది. ఈ క్రమంలో జస్‌ప్రీత్ బుమ్రాకు వన్డే సిరీస్ నుంచి విశ్రాంతి ఇస్తారనే కథనం బయటకొచ్చింది. అతడి గాయం ఏమైనా తిరగబెట్టిందా? అనే అనుమానం రాకమానదు. కానీ, అలాంటిదేమీ లేదని.. టెస్టు సిరీస్ కోసమే ఈ నిర్ణయం తీసుకొనే అవకాశం ఉందని క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి. "బుమ్రా పూర్తి స్థాయిలో ఫిట్‌గా ఉన్నాడు. కివీస్ పర్యటన సుదీర్ఘమైంది. ఇక్కడ ఏ సిరీస్‌కు ప్రాధాన్యత ఇవ్వాలనేది చూస్తాం. మిగతా రెండింటితో పోలిస్తే టెస్టు సిరీస్ ముఖ్యమైంది. వన్డేల నుంచి టెస్టు క్రికెట్‌పై వెంటనే ఫోకస్ చేయడం చాలా కష్టమైంది. కేవలం కివీస్ పర్యటనకు మాత్రమే కాదు. వచ్చే ఏడాది బోర్డర్ గావస్కర్ ట్రోఫీ కూడా ఉంది. ద్వైపాక్షిక సిరీస్‌ల కోసం అతడితో పరిమిత ఓవర్ల క్రికెట్ ఎక్కువగా ఆడించకూడదు. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ చాలా ఇంపార్టెంట్. దానిని దృష్టిలో ఉంచుకొనే ప్రణాళికలు సిద్ధం చేస్తాం" అని బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి. అక్టోబర్ 22 నుంచి టీ20లు ప్రారంభమై.. నవంబర్ 1తో ముగుస్తాయి. ఇక వన్డేలు నవంబర్ 4 నుంచి మొదలై 15వ తేదీ వరకూ జరుగుతాయి. నవంబర్ 19న తొలి టెస్టు, నవంబర్ 27న రెండో టెస్టు ప్రారంభమవుతాయి.

**డబ్ల్యూటీసీ ఫైనల్‌కు వెళ్లాలంటే?**

ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ నాలుగో సీజన్‌లో భారత్ ఫైనల్‌కు చేరుకోవాలంటే రాబోయే ప్రతి మ్యాచూ కీలకమైందే. కివీస్‌ను తమ సొంత గడ్డపై ఎదుర్కోవడం ఏ జట్టుకైనా కష్టమే. ఇప్పుడు ఆ కఠిన పరీక్ష భారత్ ముందుంది. రెండు టెస్టుల సిరీస్‌ను కోల్పోకుండా విజేతగా నిలిస్తేనే.. టీమ్ఇండియా డబ్ల్యూటీసీ టేబుల్‌లో ముందుకొస్తుంది. ప్రస్తుతం భారత్ 51.52 శాతంతో ఐదో స్థానంలో ఉంది. ఆస్ట్రేలియా (80%), దక్షిణాఫ్రికా (75%), న్యూజిలాండ్ (72.22 శాతం), బంగ్లాదేశ్ (55.56 శాతం) ముందున్నాయి. కివీస్‌పై రెండు టెస్టుల సిరీస్‌ను 20 తేడాతో గెలిస్తే మాత్రం కనీసం మూడో ప్లేస్‌కు వచ్చేందుకు అవకాశం ఉంది. ఒక్కటి ఓడినా భారత్ ఫైనల్ రేసు నుంచి ఇంకా వెనుకబడిపోవడం ఖాయం. ఆ తర్వాత ఆసీస్‌తో బోర్డర్ గావస్కర్ ట్రోఫీ కూడా ఉంది. అందుకోసమే బుమ్రా వంటి కీలకమైన బౌలర్‌కు వన్డే సిరీస్ నుంచి విశ్రాంతి ఇచ్చి.. టెస్టుల్లోనే ఆడించాలనేదే మేనేజ్‌మెంట్ ప్రణాళికగా ఉంది. తొలి రెండు స్థానాల్లో ఉన్న జట్లకే ఫైనల్‌లో ఆడే అవకాశం ఉంటుంది.






## ఈ జట్టుతో వరల్డ్ కప్‌ను నెగ్గడం
## కష్టమే: భారత మాజీ క్రికెటర్

వెస్టిండీస్‌తో నాలుగో టీ20 మ్యాచ్‌లో భారీ లక్ష్యాన్ని ఛేదించడంలో భారత్ విఫలమైంది. అంతకుముందు బౌలింగ్‌లోనూ ధారాళంగా పరుగులు సమర్పించడం టీమ్ఇండియాను దెబ్బ కొట్టింది. ఈ క్రమంలో భారత మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. ఇలాంటి జట్టు రాబోయే ప్రపంచ కప్‌ను నెగ్గడం చాలా కష్టమని అభిప్రాయపడ్డాడు. "హైదరాబాద్ మ్యాచ్‌లో భారత్ ఎందుకు ఓడిపోయింది? కేవలం బౌలింగ్ వల్లనే. బౌలర్లే భారీగా పరుగులు సమర్పించారు. 247 పరుగులు ఇవ్వడమంటే చిన్న విషయం కాదు. ఇదే తొలిసారి కాదు. అంతకుముందు కూడా 250+ టార్గెట్‌ను కాపాడుకోవడంలోనూ బౌలర్లు విఫలమయ్యారు. ఐదు మ్యాచుల్లో మూడింటిని బ్యాటర్లు గెలిపిస్తే.. మిగతా రెండింటిని బౌలర్లు గెలిపించాలి. కానీ, బౌలర్లు ఆ పనిచేయలేకపోయారు. ఇలాంటి కాంబినేషన్‌తో వరల్డ్ కప్‌ను నెగ్గడం అసాధ్యం" అని కైఫ్ వ్యాఖ్యానించాడు.

**2024 వరల్డ్ కప్ గుర్తుందా?**

"మీరు ఒకసారి 2024 టీ20 ప్రపంచ కప్‌ను గుర్తు చేసుకోండి. విజయం సాధించడంలో ప్రతి



ఒక్కరూ భాగస్వామిగా నిలిచారు. జస్‌ప్రీత్ బుమ్రా, అక్షర్ పటేల్, కుల్‌దీప్ యాదవ్.. బౌలర్లతోపాటు బ్యాటర్లూ అదరగొట్టారు. ఇప్పుడు విండీస్‌తో నాలుగో మ్యాచ్‌లో అభిషేక్ శర్మ నెమ్మదిగా ఆడాడని కొందరు అంటున్నారు. ప్రతి బ్యాటరూ అన్ని రోజులూ అద్భుతంగా ఆడటం కష్టమని గ్రహించాలి. సంజు శాంసన్ అదిరే ఆరంభం ఇచ్చాడు" అని కైఫ్ తెలిపాడు. తొలి మ్యాచ్‌లో మినహా.. మిగతా మూడింట్లోనూ 200+కిపైగా పరుగులను భారత బౌలర్లు సమర్పించారు. ఇక రెండో మ్యాచ్‌లో అయితే.. 250 టార్గెట్‌ను కూడా భారత్ కాపాడుకోలేకపోయింది.

# గత 25 ఏళ్లుగా నీ అసిస్టెంట్‌నే కదా!: యువరాజ్ సింగ్

ఆటగాళ్లుగా సౌరభ్ గంగూలీ, యువరాజ్ సింగ్ భారత క్రికెట్ జట్టుకు అద్భుత విజయాలు అందించారు. వీరిద్దరూ కలిసి మరోసారి పనిచేయనున్నారు. అయితే, ఇప్పుడు ప్లేయర్లుగా కాదు.. కోచ్‌లుగా మారారు. వచ్చే ఐపీఎల్ సీజన్ కోసం దిల్లీ క్యాపిటల్స్ జట్టు కోచింగ్ స్టాఫ్‌లో కీలక మార్పులు చేసింది. ఆ జట్టు ప్రధాన కోచ్‌గా సౌరవ్ గంగూలీని ఇటీవలే నియమించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు యువరాజ్‌ను దిల్లీ జట్టుకు అసిస్టెంట్, బ్యాటింగ్ కోచ్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. తన ఎంట్రీ సందర్భంగా గంగూలీతో యువీ సరదా సంభాషణ ఇలా..



* గంగూలీ: నువ్వు నా అసిస్టెంట్ అవుతావా?
* యువీ: (నవ్వుతూ) నేను గత 25 ఏళ్లుగా నీకు అసిస్టెంట్‌నే కదా.. ఇప్పుడూ నా పని అదే.

* ఉత్సాహంగా ఉన్నా: యువీ

శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మలాంటి యువ క్రికెటర్లకు యువరాజ్ మెంటర్‌గా వ్యవహరిస్తున్నారు. ఇప్పుడు ఫ్రాంచైజీ కోచింగ్ సెటప్‌లోకి అడుగు పెట్టడంపై యువీ హర్షం వ్యక్తం చేశారు. "ఈ బాధ్యతల కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నా. కెరీర్‌లో నన్ను ప్రోత్సహించిన గంగూలీని గురువుగా, పెద్దన్నలా భావిస్తా. డ్రెస్సింగ్ రూమ్‌లో ఆటగాళ్లందరినీ కలుపుకొని వెళ్లడం, గెలుపు సంస్కృతిని అలవర్చడంలో గంగూలీ శైలే వేరు. ఆయనతో కలిసి పనిచేయడం ఎంతో సంతోషంగా ఉంది" అని యువీ తెలిపాడు.



# లింక్డిన్‌లో విరాట్ ఫస్ట్ పోస్టు.. స్పందించిన సత్యనాదెళ్ల

భారత స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ ఇటీవలే లింక్డిన్‌లో తొలి పోస్టు పెట్టిన సంగతి తెలిసిందే. దీనిపై మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల స్పందించారు. "ఇప్పుడు నా ఫీడ్ మరింత ఆసక్తికరంగా మారింది. విరాట్.. లింక్డిన్‌లోకి స్వాగతం. వన్8వరల్డ్‌తో మీ కొత్త వ్యాపార ప్రయాణానికి నా శుభాకాంక్షలు" అని నాదెళ్ల పోస్టు చేశారు.

**కోహ్లీ ఏమని పోస్టు పెట్టాడంటే?**

"భారత్‌లో ప్రతి క్రీడనూ ఆదరించి, ఆస్వాదించే రోజులు రావాలని నేనెప్పుడూ కోరుకుంటాను. ఇప్పుడు ఆ రోజుకు మరింత దగ్గరవుతున్నట్లు అనిపిస్తోంది. మన దేశం ప్రపంచ స్థాయి క్రీడాకారులను తయారుచేయగలదని, అంతర్జాతీయ వేదిక కోసం బ్రాండ్‌లను సృష్టించగలదని కొత్త తరం నిరూపిస్తోంది. భారత్ ఓ సమగ్ర క్రీడా వేదికను నిర్మించగలదనే నమ్మకం కలుగుతోంది. ఇకపై మనం ప్రపంచ వేదిక మీద కేవలం పాల్గొనడం మాత్రమే కాదు.. అంతర్జాతీయ టోర్నీల భవిష్యత్తును తీర్చిదిద్దగలమని విశ్వసిస్తున్నా. సరిహద్దులను చెరిపేసి, ఉన్నత ప్రమాణాలతో విభిన్న ప్రయత్నాలకు సాహసించినప్పుడే వృద్ధి చేకూరుతుందని నా కెరీర్‌లో నేర్చుకున్నా" అని కోహ్లీ ఆ పోస్ట్‌లో రాసుకొచ్చాడు.

